TGTEL/25/A3603

# కింగ్

డైలీ న్యూస్ పేపర్

King Daily News Paper

PUBLISHED FROM HYDERABAD AND VIJAYAWADA

హైదరాబాద్ సంపుటి: 01 సంచిక : 233 ఆదివారం, జులై 12, 2026 పేజీలు :8 వెల.1/-




# నదిలో నీళ్లను నేరుగా ఎత్తిపోయగలిగితే బ్యారేజీలు ఎందుకు నిర్మించారు?

- తెలంగాణ వాదుల ముసుగులో కాళేశ్వరంపై భారాస వాదన వినిపిస్తున్న విశ్రాంత ఇంజినీర్లు
- గతంలో జరిగిన దోపిడీలు, అక్రమాల్లో వారికీ సంబంధం ఉంది
- ప్రాజెక్టు బాధ్యతను కిలాడీ కమిటీకి అప్పగించం
- ఈ కమిటీకి ఛైర్మన్ కేసీఆర్.. సభ్యుడు హరీశ్‌రావు
- ఇప్పుడు ఇందులో ఈటల కూడా చేరి భారాస పల్లవి అందుకున్నారు
- సీఎం రేవంత్‌రెడ్డి ఘాటు విమర్శలు





హైదరాబాద్: మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల అవసరం లేకుండానే నీటిని ఎత్తిపోసేలా ఉంటే భారీగా ఖర్చు చేసి బ్యారేజీలను ఎందుకు నిర్మించారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. గత పాలకులు అన్ని రకాల తప్పులు చేసి, అవకతవకలకు పాల్పడి ఇప్పుడు తమ ప్రభుత్వంపై బురదజల్లే రాజకీయం చేస్తున్నారని ధ్వజమెత్తారు. కాళేశ్వరం ప్రాజెక్టు బాధ్యతను నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ(ఎన్డీఎస్ఏ) కమిటీకి అప్పగించడానికి ఎలాంటి అభ్యంతరం లేదని, కిలాడీ కమిటీకి మాత్రం కాదని అన్నారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, రాజ్యసభ సభ్యులు వేం నరేందర్‌రెడ్డి, పలువురు ఎమ్మెల్యేలతో కలిసి ముఖ్యమంత్రి శనివారం ఇక్కడ సచివాలయంలో విలేకరులతో మాట్లాడారు. "నదిలో పరిగెత్తే నీళ్లను ఎత్తిపోయగలిగితే ఇంక బ్యారేజీలు ఎందుకు? భారాస మాట్లాడితే సీరియస్‌గా తీసుకోవాల్సిన అవసరం లేదు.

విశ్రాంత ఇంజినీర్ల సంఘం వారు తెలంగాణ వాదుల ముసుగులో భారాస వాదన వినిపిస్తున్నారు. నీళ్లు ఎత్తిపోయాలంటున్నారు. 2015 డిసెంబరులో విశ్రాంత ఇంజినీర్లతో కమిటీ ఏర్పాటు చేస్తే మేడిగడ్డ వద్ద బ్యారేజీ వద్దు.. తుమ్మిడిహెట్టి వద్ద.. కాదంటే వేమనపల్లి వద్ద కట్టమని చెప్పింది. ఆ కమిటీలో ఉన్న శ్యాంప్రసాద్‌రెడ్డి ఇప్పుడు సన్నాయి నొక్కులు నొక్కుతున్నారు. ఇలాంటి వాళ్లకు ముసుగు వేసి కిలాడీ కమిటీ మమ్మల్ని దోషులుగా చూపే ప్రయత్నం చేస్తోంది" అంటూ విశ్రాంత ఇంజినీర్ల సంఘంపై తీవ్రస్థాయిలో మాట్లాడారు. గతంలో జరిగిన దోపిడీలు, అక్రమాలు, అవకతవకల్లో ఈ సంఘంలోని వారికి కూడా సంబంధం ఉందన్నారు.

**వారితో చేరిన ఈటల:** కిలాడీ కమిటీకి కేసీఆర్ ఛైర్మన్ కాగా, హరీశ్‌రావు సభ్యుడు. ఇప్పుడు భాజపా ఎంపీ ఈటల రాజేందర్ కూడా అందులో చేరారు. ఆయనను కాళేశ్వరం దర్యాప్తులో జస్టిస్ పీసీ ఘోష్ కూడా విచారించారు. ఈటల కూడా భారాస పల్లవినే అందుకొని మాట్లాడుతున్నారు. ఎన్డీఎస్ఏ, సంబంధిత మంత్రుల అభిప్రాయాలు తీసుకొని సూచన చేసి ఉంటే గౌరవం పెరిగేది. హరీశ్‌రావు సూచనల మేరకు మాట్లాడి గౌరవం పోగొట్టుకున్నారు. ఆయన కేంద్రంలోని ప్రభుత్వానికి సంబందించిన వ్యక్తే కదా.. కేంద్ర జలజక్తి మంత్రివద్దకు వెళ్లి ఎన్డీఎస్ఏ ఛైర్మన్‌ను పిలిపించి మాట్లాడి తాత్కాలికంగా నీళ్లు ఎత్తిపోయడానికి ఒప్పిస్తే మేము పూర్తిగా సహకరిస్తాం. ఎన్డీఎస్ఏ నిపుణులను తీసుకొస్తే అప్పగించడానికి ఎలాంటి అభ్యంతరం లేదు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణంలో అవకతవకలు, అవినీతి ఆరోపణలపై కాళేశ్వరం కేసును సీబీఐ విచారణకు అప్పగించి 11 నెలలైంది. ఇప్పటివరకు విచారణ ఎందుకు ప్రారంభం కాలేదో ఈటల చెప్పాలి.

**ఈఈ లేఖపై నిర్లక్ష్యం వల్లే బ్యారేజీ కూలింది** : 2019 జూన్ 21న అప్పటి ముఖ్యమంత్రి కాళేశ్వరం ప్రారంభించారు. 2020 మే 18న మేడిగడ్డ బ్యారేజీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఇందులో లోపాలున్నాయి, సరిదిద్దండని నిర్మాణ సంస్థ ఎల్అండ్‌టీకి లేఖ రాశారు. సీసీ బ్లాకులు దెబ్బతిన్నాయని కూడా రాశారు. అప్పుడు ముఖ్యమంత్రిగా, నీటిపారుదల శాఖ మంత్రిగా కేసీఆర్ ఉన్నారు. ఈఈ రాసిన లేఖపై నిర్లక్ష్యం వహించడం వల్లే బ్యారేజీ కూలింది. ప్రణాళిక, డిజైన్, నిర్మాణం, నిర్వహణ అన్నింటిలో నిర్లక్ష్యాన్ని ఎత్తి చూపుతూ ఎన్డీఎస్ఏ మధ్యంతర నివేదిక ఇచ్చింది. ఎన్డీఎస్ఏ అంతక్రితం ఎక్కడికీ పోలేదని, కాళేశ్వరం విషయంలోనే ఎందుకు వచ్చినట్లని హరీశ్‌రావు అడుగుతున్నారు. 2021 డిసెంబరు 20న పార్లమెంటు డ్యాం సేఫ్టీ చట్టాన్ని తెచ్చింది. నిర్వహణ, పర్యవేక్షణ, తనిఖీలు, మరమ్మతుల కోసం ఈ చట్టం చేసింది. అందుకే 2023లో మేడిగడ్డ బ్యారేజీ సంఘటన జరిగిన వెంటనే పరిశీలించి ఏడో బ్లాక్ దెబ్బతినడం వల్ల మొత్తం బ్యారేజీకే ప్రమాదం ఏర్పడిందని, నీటిని నిల్వ చేయవద్దని చెప్పింది.

బ్యారేజీల పునరుద్ధరణకు కేంద్ర జలశక్తి మంత్రిత్వశాఖ జూన్ 30న మరో నిపుణుల కమిటీని నియమించి రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాసింది. ఎన్డీఎస్ఏ మెంబర్ టెక్నికల్ ఛైర్మన్‌గా వ్యవహరిస్తారు. సీడబ్ల్యూసీలోని డిజైన్స్, గేట్ల విభాగం డైరెక్టర్లు, పరిశోధనా సంస్థలు సీడబ్ల్యూపీఆర్ఎస్, సాయిల్ మెకానికల్ రీసెర్చి ఇన్‌స్టిట్యూట్‌తో పాటు రాష్ట్ర నీటిపారుదల శాఖ నుంచి సభ్యులను నియమించింది. అవసరాన్ని బట్టి జాతీయ, అంతర్జాతీయ స్థాయి నిపుణుల సేవలను వినియోగించుకోవచ్చని చెప్పింది. పరీక్షలు పూర్తయినందున పునరుద్ధరణ పనులు, డిజైన్లు అన్నీ పరిశీలించి వినియోగంలోకి తేవడానికి ఈ కమిటీని నియమించింది. నాణ్యత బాధ్యత ప్రాజెక్టు అథారిటీదేనని కూడా చెప్పింది. కేంద్రం నియమించిన కమిటీ మాట వినాలా లేదా'' అని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు.

**బ్లాక్‌మెయిల్ చేసి పాత కమీషన్లు రాబట్టుకొనేందుకే** : "మీ మామే మిమ్మల్ని నమ్మక సంవత్సరం పాటు మంత్రి పదవినే ఇవ్వలేదు, ఇప్పుడు పాత కమీషన్లు వసూలు చేసుకోవడానికి, బ్లాక్ మెయిల్ చేయడానికి మంత్రి పదవి ఇవ్వాలా'' అని హరీశ్‌రావును ఉద్దేశించి ముఖ్యమంత్రి తీవ్రంగా వ్యాఖ్యానించారు. నాడు అందరూ కలిసి పది శాతం కమీషన్లుగా తీసుకొన్నారని.. ఉద్యమం సమయంలో రక్తం పీల్చుతున్నాయని మాట్లాడిన కాలేజీలతోనే ఇప్పుడు లబ్ధి పొందుతున్నారని ఆరోపించారు. మేడిగడ్డ నుంచి నీటిని ఎత్తిపోయకుండా కిందికి వదిలి పట్టిసీమ నుంచి ఎత్తిపోయడానికి సహకరిస్తున్నారని భారాస చేసిన ఆరోపణలపైన కూడా రేవంత్‌రెడ్డి తీవ్రంగా స్పందించారు. "పట్టిసీమను ప్రారంభించింది, నీళ్లను తరలించుకుపోయింది మీ హయాంలోనే కదా! 2015లోనే ప్రారంభించి పూర్తి చేసి 2016లోనే నీటిని తరలించారు. ఒక సంవత్సరం ఏకంగా 105 టీఎంసీలు మళ్లించారు. ప్రతి సంవత్సరం మళ్లిస్తూనే ఉన్నారు" అని సీఎం అన్నారు.

**కాళేశ్వరాన్ని కూలేశ్వరం చేసిన వాళ్లు చెప్పినట్లు చేయాలా?:** "ఎన్డీఎస్ఏ.. 2025 ఏప్రిల్ 24న తుది నివేదిక ఇచ్చింది. ఈ నివేదికనే భగవద్గీత, బైబిల్, ఖురాన్‌గా భావించి పునరుద్ధరణకు అహర్నిశలు కృషి చేస్తున్నాం. అది బ్యారేజీలు నీటిని నిల్వ చేయడానికి, నిర్వహణకు పనికి రావని చెప్పింది. ఏమేం పరీక్షలు చేయాలో, ఎవరితో చేయించాలో సూచించింది. పరీక్షల ఫలితాలు వచ్చి మరమ్మతులు చేసే వరకు గేట్లు పూర్తిగా ఎత్తి ఉంచాలని స్పష్టంగా చెప్పింది. కిలాడీ కమిటీలు ఇచ్చే నివేదికల ప్రకారం కాదు పనులు చేయాల్సింది.. ఎన్డీఎస్ఏ చెప్పినట్లు. నీళ్లు పోతున్నా ఎత్తిపోయలేదంటున్నారు. పరుగెత్తే నీళ్లను ఆపి ఎత్తిపోయడానికే కదా బ్యారేజీలు, పక్కన పంపుహౌస్‌లు నిర్మించింది. మేడిగడ్డలో 93.5 మీటర్ల వరకు నీటిని ఆపితే కనీసం ఐదు టీఎంసీలు ఉండి కన్నెపల్లి పంపుహౌస్ నిర్వహించడం వీలవుతుంది. ఇక్కడి నుంచి ఎత్తి అన్నారంలో పోద్దామంటే అక్కడ గేట్లు మూయడానికి వీల్లేని పరిస్థితి. అలాంటప్పుడు మళ్లీ వెనక్కు మేడిగడ్డకు వచ్చి కిందకు పోతాయి కదా. అన్నారం బ్యారేజీలో నిల్వ చేస్తేనే సుందిళ్ల బ్యారేజీకి ఎత్తిపోయగలం. కానీ ఎన్డీఎస్ఏ ప్రకారం సుందిళ్ల బ్యారేజీలోనూ గేట్లను తెరిచే ఉంచాలి. ప్రతి బ్యారేజీలో గేట్లు మూసి కనీసం ఐదేసి టీఎంసీలు నిల్వ చేస్తే కానీ ఎత్తిపోయడం వీలుకాదు. మరోపక్క గేట్లు మూస్తే బ్యారేజీలకే ప్రమాదం..అలా చేయడానికి వీల్లేదని ఎన్డీఎస్ఏ చెప్పింది. వీటన్నిటినీ పక్కన పెట్టి అతి తెలివి తేటలతో ప్రజలను మభ్యపెట్టి మమ్మల్ని బదనాం చేయడానికి ప్రయత్నిస్తున్నారు. ఎన్డీఎస్ఏ ప్రకారం గేట్లు నిర్వహించాలా లేక మూడేళ్లకే కాళేశ్వరాన్ని కూలేశ్వరం చేసిన వాళ్లు చెప్పినట్లు చేయాలా?

# సిఎం డైవర్షన్ డ్రామాలు

**కార్పొరేషన్ ఛైర్మన్లపై ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు**

**హరీశ్‌రావు పార్టీ మారేందుకు ఎవరెవరిని కలిశారో నాకు తెలుసు**

**యాదగిరి గుట్ట దేవాలయ బోర్డు సభ్యుల ఎంపికలో అన్ని కులాలకు ప్రాధాన్యం**

**మీడియాతో చిట్‌చాట్‌లో సిఎం రేవంత్‌రెడ్డి**



హైదరాబాద్: కార్పొరేషన్ ఛైర్మన్‌ల పదవీకాలం ముగిసిందని, వారి విషయంలో ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని సిఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. ఎంసిఆర్‌హెచ్‌ఆర్‌డిలో సిఎం రేవంత్ రెడ్డి శనివారం విలేకరులతో చిట్‌చాట్ చేశారు. ఎంసిఆర్‌హెచ్‌ఆర్‌డిలో బోధి పెవిలియన్‌లో సిఎం రేవంత్‌రెడ్డి నిర్మించుకున్న కార్యాలయం కోసం నిధులు దుర్వినియోగం చేశారని బిఆర్‌ఎస్ చేసిన ఆరోపణలపై స్పందించిన సిఎం రేవంత్‌రెడ్డి బోధి ఫెవిలియన్ భవనం లోపల ఉ న్న వసతులను మీడియాకు చూపించారు. బాత్‌రూమ్‌లను బంగారంతో, బుల్లెట్ ప్రూఫ్‌లతో చేయించుకోలేదని సిఎం ఈ సందర్భంగా విలేకరులతో పేర్కొన్నారు. తాను ఫ్యామిలీతో కలిసి ఇక్కడకు వస్తానని, తాను ఎంసిఆర్‌హెచ్‌ఆర్‌డికి ఛైర్మన్ అని, ఇది తనకు క్యాంప్ ఆఫీస్ లాంటిదని, కెటిఆర్ మాదిరిగా సీక్రెట్‌గా తాను ఎటు పోవడం లేదని సిఎం రేవంత్‌రెడ్డి తెలిపారు.

మాజీ మంత్రి హరీశ్‌రావు మాజీ సిఎం కెసిఆర్‌ను ని త్యం లోపల ఎన్ని బూతులు తిడుతున్నారో తనకు తె లుసునని, ఆంధ్రవాళ్లకు పాలను అమ్మే నీచపు వ్యక్తి హరీశ్‌రావు అని, ఆంధ్రావాళ్ల మోచేతి నీళ్లు తాగడం దుర్మార్గమని సిఎం రేవంత్‌రెడ్డి ఆరోపించారు. హరీశ్‌రావు పార్టీ మారేందుకు ఎవరెవరిని కలిశారో తనకు తెలుసుఅని ఆయన అన్నారు. షాబాద్ సంఘటనపై పోలీసు విచారణ కొనసాగుతోందని తెలిపారు. బిఆర్ఎస్ ప్రభుత్వం కన్నా తమ ప్రభుత్వంలో కొత్త స్కీములను చాలా అమలు చేశామని, బిఆర్ఎస్ వాళ్లు అమల్లోకి తీసుకొచ్చిన పథకాలను కూడా ఆపకుండా వాటి ని సైతం అమలు చేస్తున్నామని ఆయన తెలిపారు.

కర్ణాటకలో జరిగిన తుంగభద్ర గేట్ల ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముగ్గురు సిఎంలు కలిస్తే తప్పేముందని సిఎం రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. అదంతా ప్రొటోకాల్‌లో భాగమేనని ఆయన తెలిపారు. యాదగిరిగుట్ట దేవాదాయ బోర్డు సభ్యుల ఎంపికపై కొంతమంది కావాలని దుష్ప్రచారం చేస్తున్నారని సిఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. సిఎంగా, మున్సిపల్ శాఖ మంత్రిగా దేవాదాయ బోర్డు సభ్యులను ఎంపిక చేయవచ్చని, ఈ బోర్డులో అన్ని కులాలకు ప్రాధాన్యం ఇచ్చామని వారు దేవాలయం అభివృద్ధి కోసం తమ సొంత నిధులను వెచ్చించడానికి సిద్ధంగా ఉన్నారని ఆయన తెలిపారు.

ఇతరుల ప్రమేయం ఉండదని, జిల్లా వాళ్లను నియమించాలన్న నిబంధన ఎక్కడా లేదన్నారు. జర్నలిస్టులకు ఈహెచ్ఎస్ సదుపాయాన్ని కల్పించే అంశంపై అధికారులతో చర్చించి నిర్ణయం తీసుకుంటానని ఆయన తెలిపారు. కొత్తగా ఏర్పడే నియోజకవర్గాల పునర్విభజనతో ఉత్తరప్రదేశ్‌కు అధికంగా లాభం జరుగుతుందని, మహిళలకు 50 శాతం సీట్లు అదనంగా పెరుగుతాయని ఆయన తెలిపారు. గతంలో కర్ణాటక, కేరళ, పశ్చిమబెంగాల్ ఎన్నికల్లో ఏయే పార్టీకి ఎన్ని సీట్లు వస్తాయో తాను వేసిన అంచనా నిజమయ్యిందని ఆయన తెలిపారు.

# బుల్లెట్ ట్రైన్ హబ్‌గా హైదరాబాద్

## హైదరాబాద్-చెన్నై-బెంగళూరును కలుపుతూ బుల్లెట్ ట్రైన్

## తెలంగాణకు రైల్వే బడ్జెట్‌ను భారీగా పెంచాం

## కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడి

హైదరాబాద్: హైదరాబాద్-చెన్నై-బెంగళూరును కలుపుతూ బుల్లెట్ ట్రైన్లు తీసుకుని రానున్నట్లుటు కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. రానున్న రోజుల్లో హైదరాబాద్ బుల్లెట్ ట్రైన్ల హబ్‌గా మారనున్నదని ఆయన చెప్పారు. 'వికసిత్ భారత్-2047, సాంకేతిక పరిజ్ఞానం' అంశంపై శనివారం నగరంలోని హెచ్ఐసిసిలో జరిగిన పారిశ్రామికవేత్తల రౌండ్ టేబుల్ సమావేశానికి కేంఅద మంత్రి అశ్వినీ వైష్ణవ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ ప్రసంగిసన్తూ తెలంగాణకు రైల్వే బడ్జెట్‌ను భారీగా పెంచామని చెప్పారు.

యుపిఏ హయాంలో రూ. 880 కోట్లు ఖర్చు చేస్తే తాము అధికారంలోకి వచ్చిన తర్వాత ఐదు వేల కోట్ల రూపాయలు ఖర్చు చేశామని ఆయన ఉదహరించారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌ను ఆధునీకరిస్తున్నామని, దేశంలో 1300 రైల్వే స్టేషన్ల ఆధునీకరణ పనులు వేగవంతం చేశామని, ఇప్పటికే 260 స్టేషన్లు ఆధునీకరించడం జరిగిందని, వీటిలో తెలంగాణలో 40 స్టేషన్లు ఉన్నాయని ఆయన వివరించారు. మొదటి బులెట్ ట్రైన్ సెక్షన్ వచ్చే సంవత్సరం ముంబయ్, పుణే మధ్య ప్రారంభిస్తామని ఆయన చెప్పారు.

ప్రధాని నరేంద్ర మోడీ దేశంలో మొత్తం 7 బులెట్ ట్రైన్స్ ప్రకటిస్తే అందులో తెలంగాణకు 3 దక్కాయని ఆయన తెలిపారు. హైదరాబాద్ నుంచి విజయవాడకు కేవలం 1.10 నిమిషాలలో వెళతారని, హైదరాబాద్ నుంచి ముంబైకి 2.20 నిమిషాలు, హైదరాబాద్ నుంచి చెన్నైకి రెండు గంటల్లో వెళ్ళవచ్చన్నారు. కొంత మంది దీనిని తమ ఖాతాలో వేసుకోవాలని చూస్తున్నారని, వారి పేరు తాను తీసుకోదలచుకోలేదన్నారు. ప్రధాని నరేంద్ర మోడీకే ఈ గొప్పతనం దక్కుతుందని



ఆయన తెలిపారు. ప్రధాని మోడీ ఆలోచన మేరకు దక్షిణాదికి అధిక ప్రాధాన్యత లభిస్తున్దని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ వివరించారు. తెలంగాణ నుంచి 5 వందే భారత్ ట్రైన్లు నడుపుతున్నామని తెలిపారు.

**కొత్త పుంతలు తొక్కుతున్న ఐటి పరిశ్రమ**

ఐటి పరిశ్రమ రోజు రోజుకూ కొత్త పుంతలు తొక్కుతున్నదని ఆయన తెలిపారు. అన్ని రంగాల్లో ఏఐ ఒక మార్గం చూపుతున్నదని ఆయన చెప్పారు. దీనికి తమ ప్రభుత్వం అన్ని రకాల సహాయ సహకారాలు అందిచేందుకు సిద్ధంగా ఉందన్నారు. సెమి కండక్టర్స్ ఇండస్ట్రీ ఐటికి చాలా దగ్గరగా ఉంటుందని, కాబట్టి ప్రధాని నరేంద్ర మోడీ సెమి కండక్టర్ ఇండస్ట్రీకి చాలా ప్రాధాన్యత ఇస్తున్నారని ఆయన వివరించారు. సెమి కండక్టర్ ఇండస్ట్రీకి 1 మిలియన్ మంది ఉద్యోగుల లోటు ఉందన్నారు. 350 యూనివర్సిటీ ఉన్నాయని, మన విద్యార్థులు సెమి కండక్టర్స్ అభివృద్ధి చేస్తున్నారని ఆయన చెప్పారు. భవిష్యత్ లో సెమి కండక్టర్ ఇండస్ట్రీలో మనం మరింత అభివృద్ధి సాధించాల్సి ఉందన్నారు. ఎలక్ట్రానిక్స్ తయారీ ఇండస్ట్రీ 30 లక్షల కోట్లకు చేరుకుందని ఆయన తెలిపారు. 3వ అతిపెద్ద ఎలక్ట్రానిక్స్ ఎగుమతిలో మనం ఉండడం గర్వకారణమని అన్నారు.

చాలా విప్లవాత్మకంగా ఇది పెరుగుతున్నదని ఆయన చెప్పారు. 104 ఎలక్ట్రానిక్స్ తయారీ పరిశ్రమలు తెలంగాణలో పని చేస్తున్నాయని ఆయన తెలిపారు. వీటిలో 4 అతి పెద్ద కంపెనీలు కూడా ఉన్నాయని ఆయన చెప్పారు.

# 117 కాదు..7 సీట్లూ రావు

**రేవంత్ రెడ్డి తిరిగి ఎన్నికయ్యేది కలనే, దమ్ముంటే ఎన్నికలకు పోవాలి**

**సొంత సర్వేలో బిఆర్ఎస్‌కి 78 సీట్లు వచ్చింది ముమ్మాటికి నిజం**

**తాను సర్వే చేయించుకోలేదని దేవునిపై ఒట్టేసి చెప్పాలి**

**తన పాలనపై నమ్మకం ఉంటే..అసెంబ్లీ రద్దు చేసి ప్రజాతీర్పు కోరాలి**

**కాళేశ్వరం నీటిని ఎత్తిపోయకుండా ప్రజలపై పగబట్టారు**

**మేడిగడ్డతో సంబంధం లేకుండా అన్ని రిజర్వాయర్లు, చెరువులు నింపవచ్చు**

**భద్రాచలం మునిగిపోతుందంటూ అబద్ధాలు**

**సీఎం రేవంత్ రెడ్డిపై తీవ్రస్థాయిలో విరుచుకుపడిన కేటీఆర్**

హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 117 స్థానాలు గెలుస్తామని చెప్పడం ఆశ్చర్యంగా ఉంది, కాంగ్రెస్‌కు 117 స్థానాలు కాదు కదా, 7 స్థానాలు కూడా రావని బీఆర్ఎస్ అధ్యక్షుడు కేటీఆర్ ఎద్దేవా చేశారు. తమకు అందిన సమాచారం ప్రకారం సీఎం స్వయంగా చేయించుకున్న సర్వేల్లో ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే బీఆర్ఎస్‌కు 78కిపైగా స్థానాలు వస్తాయని తేలిందన్నారు. మరో 4 సర్వేల్లో కూడా బీఆర్ఎస్ అధికారంలోకి వస్తుందని నివేదికలు వచ్చాయని తెలిపారు.



తెలంగాణ భవన్‌లో శనివారం కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ రేవంత్ రెడ్డి తిరిగి ఎన్నికయ్యేది కలేనని, తన సొంత సర్వేలోనే 78 సీట్లు వస్తాయని చెప్పింది ముమ్మాటికి వాస్తవమన్నారు. తాను సర్వే చేయించుకోలేదు అన్న విషయం నిజమైతే, దేవుడిపైన ఒట్టు వేసి చెప్పాలన్నారు. రాముడిపైన ఒట్టు వేసి అబద్ధాలు చెబితే రేవంత్ రెడ్డికి నష్టం జరుగుతుందని కేటీఆర్ హెచ్చరించారు. తన పాలన పట్ల అంత నమ్మకం ఉంటే రేవంత్ రెడ్డికి దమ్ముంటే స్థానిక సంస్థల ఎన్నికలు లేదా పార్టీ మారిన ఎమ్మెల్యేల స్థానాల్లో ఉప ఎన్నికలు లేదంటే అసెంబ్లీని రద్దు చేసి తిరిగి ఉప ఎన్నికలకు ఎన్నికలకు పోవాలని సవాల్ చేశారు.

రేవంత్ రెడ్డికి నీళ్లు ఎత్తిపోయడం తెలవదు, కేవలం సంచులలో పైసలు నింపి ఢిల్లీకి కట్టే ఈఎంఐలు మాత్రమే తెలుసునని కెటిఆర్ విమర్శించారు. మొలవది అనుకున్న ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని ఉద్యమించి, సబ్బండ వర్గాలను ఏకం చేసి రాష్ట్రాన్ని తెచ్చిన నాయకుడు కేసీఆర్ అని అన్నారు. అలాంటి ఆయన గురించి రేవంత్ రెడ్డి మాట్లాడడం రేవంత్ రెడ్డి స్థాయి కాదని అన్నారు. రాహుల్ గాంధీ 2014 నుంచి పదుల సంఖ్యలో ఎన్నికలు ఓడిపోయాడని, అలాంటప్పుడు కాంగ్రెస్ పార్టీ పని అయిపోయినట్టేనా అని కేటీఆర్ ప్రశ్నించారు. నిజంగానే బీఆర్ఎస్ పార్టీని ఆపగలిగే శక్తి ఉంటే వెంటనే రాష్ట్రంలో జిల్లా పరిషత్ ఎన్నికలో, లేదంటే పార్టీ మారిన ఎమ్మెల్యేల ఉపఎన్నికలో లేదా మొత్తం శాసనసభను రద్దు చేసే అసెంబ్లీకి ఎన్నికలు నిర్వహించే దమ్ము ఉందా అని రేవంత్ రెడ్డికి కేటీఆర్ సవాల్ చేశారు. నిజంగానే రేవంత్ రెడ్డికి తిరిగి అధికారంలోకి వస్తానన్న ధైర్యం ఉంటే వెంటనే పార్టీ మారిన ఎమ్మెల్యేల స్థానాల్లో ఉపఎన్నికలకు సిద్ధం కావాలని కూడా సవాల్ విసిరారు. రేవంత్ రెడ్డి మళ్లీ ఎన్నికవ్వడం కలనే అన్నారు. తాను మాట్లాడేది రాజకీయ అంశాలపై కాదని, పూర్తిగా రైతుల ప్రయోజనాల కోసమేనని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని రిజర్వాయర్లలో ప్రస్తుతం కేవలం 23 శాతం మాత్రమే నీరు ఉందని, మిగిలిన 77 శాతం సామర్థ్యం ఖాళీగా ఉందని పేర్కొన్నారు.

# సంపాదకీయం

**ఆదివారం, జులై 12, 2026**

## తెరపైకి మెన్ కమిషన్

ఇది అత్యంత బాధాకరమైన విషయం.. ఎందుకంటే జరుగుతున్న సంఘటనలు అలా ఉన్నాయి కాబట్టి. గతంలో ఎన్నడూ కూడా ఈ విధంగా లేదు.. ఇలాంటి సంఘటనలు జరగలేదు. కానీ ఇప్పుడు ఒక దాని తర్వాత ఒకటి చోటు చేసుకుంటున్నాయి. ఎలా ఉంటున్నాయి అంటే.. ఒకదాన్ని మించి మరొకటి ఉంటున్నాయి. పైగా భయాన్ని కలగజేస్తున్నాయి. జీవితంలో పెళ్లి అంటేనే వెన్నులో వణుకు పుట్టే విధంగా చేస్తున్నాయి.పూణేలో కేతన్ అగర్వాల్ ను అతనికి కాబోయే భార్య సియా, ఆమె ప్రియుడు చేతన్ చంపేసిన తర్వాత.. ఆ విషయం వెలుగులోకి వచ్చిన తర్వాత.. ఈ కేసు కు సంబంధించిన అనేక సంచలన నిజాలు ఒకదాని వెంట ఒకటి బయటపడుతున్న తర్వాత.. మనదేశంలో ఒక రకమైన చర్చ నడుస్తోంది. ఆ చర్చ ఏకంగా పార్లమెంట్ దాకా వెళ్ళింది. పైగా పెద్ద పెద్ద రాజకీయ నాయకులు కూడా జరుగుతున్న పరిణామాలను చూసి భయపడుతున్నారు.దేశంలో ఒక వింత, విచిత్రమైన, మునుపెన్నడూ ఊహించని చర్చ మొదలైంది. ఇప్పటివరకు 'మగాడ్రా బుజ్జీ.. నీకేం తక్కువ?' అంటూ మీసాలు తిప్పిన పురుష పుంగవుల కోసం ప్రత్యేకంగా ఒక కమిషన్ కావాలంటూ రాజ్యసభ ఎంపీ అశోక్ కుమార్ మిట్టల్ ఒక ప్రైవేట్ మెంబర్ బిల్లును పార్లమెంట్‌లో పడేశారు. "జాతీయ మహిళా కమిషన్" తరహాలోనే, ఇకపై "జాతీయ పురుషుల కమిషన్" కూడా పెట్టాలని ఆయన డిమాండ్. ఈ బిల్లు బయటకొచ్చిందో లేదో.. పుణెలో జరిగిన కేతన్ అగర్వాల్ హత్య కేసు పుణ్యమా అని సోషల్ మీడియాలో 'మెన్ ఆర్ ఆల్సో హ్యూమన్స్' (మగాళ్లు కూడా మనుషులే) అనే ట్రెండ్ ఊపందుకుంది. కన్నీళ్లు పెడుతున్న 'కండల వీరులు' సమాజంలో మగాడంటే ఎప్పుడూ స్ట్రాంగ్‌గా ఉండాలి, ఏడవకూడదు.. భరించాలి అనే రూల్స్ ఉన్నాయి కదా! కానీ ఈ బిల్లు తెచ్చిన లెక్కలు చూస్తుంటే మగాళ్ల గుండెల్లో దాగున్న బాధలు హిమాలయాలంత ఉన్నట్టు కనిపిస్తోంది. ఇంట్లో భార్య చేతిలో లేదా బెల్లం ముక్క లాంటి అత్తగారి చేతిలో దెబ్బలు తిన్నా బయటకు చెప్పుకోలేక కుమిలిపోయే భర్తలు ఎందరో.. ఎక్స్ లోనో, పోలీస్ స్టేషన్ లోనో ఒక్క తప్పుడు కేసు పడితే.. కెరీర్ గోవిందా! విడాకులయ్యాక పిల్లల్ని చూడనివ్వకుండా కేవలం మెయింటెనెన్స్ డబ్బుల కోసం మాత్రమే వాడుకునే 'ఏటీఎం' మిషన్లుగా మగాళ్లు మారుతున్నారట. ఆఫీసు ఒత్తిళ్లు, సామాజిక అంచనాలు తట్టుకోలేక దేశంలో పురుషుల ఆత్మహత్యల శాతం రాకెట్‌లా దూసుకెళ్తుంటే.. ''అయ్యో పాపం'' అనే నాథుడే కరువయ్యాడని పురుషుల హక్కుల సంఘాలు గొంతు చించుకుంటున్నాయి. ఒకవేళ దేవుడు కరుణించి అంటే పార్లమెంట్ ఒప్పుకొని ఈ కమిషన్ ఏర్పాటైతే.. మగాళ్లకు ఒక 'సేఫ్ జోన్' దొరుకుతుంది. "మా ఆవిడ నన్ను రోజుకు పదిసార్లు తిడుతోంది సార్" అని ఏడ్చే భర్తలకు ఉచితంగా టిష్యూ పేపర్లు, మానసిక ధైర్యం ఇస్తారు. ఉచిత న్యాయ సహాయం కింద తప్పుడు కేసుల నుంచి ఎలా తప్పించుకోవాలో లాయర్లతో ఫ్రీగా సలహాలు ఇప్పిస్తారు. అలిగిన భర్తలకు, అత్తగారి వేధింపులకు గురయ్యే అల్లుళ్లకు ఇదొక పెద్ద దిక్కు అవుతుంది."మేమేదో మహిళల హక్కులను లాగేసుకుందామని చూడట్లేదు బాబోయ్! వాళ్ల చట్టాలు వాళ్లకుండనివ్వండి.. మాకు కనీసం ఒక చిన్న కంప్లైంట్ బాక్స్ అయినా ఇవ్వండి" అని బిల్లు ప్రతిపాదకులు చేతులు జోడించి మరీ చెప్తున్నారు. చట్టం అవుతుందా.. లేక చాయ్ బిస్కెట్ ముచ్చటవుతుందా? మన దేశ పార్లమెంట్ చరిత్ర చూస్తే 'ప్రైవేట్ మెంబర్ బిల్లులు' చట్టాలుగా మారడం అనేది.. లాటరీలో కోటి రూపాయలు తగలడం కంటే అరుదు. కాబట్టి ఈ బిల్లు రేపో మాపో చట్టం అయిపోయి, మగాళ్లందరికీ రక్షణ వచ్చేస్తుందని పగటి కలలు కనడం కాస్త అత్యాశే అవుతుంది. అయినప్పటికీ ''మగాడికి కూడా మనసుంటుంది, వాడికీ కష్టాలొస్తాయి" అనే ఒక టాపిక్ మీద పార్లమెంట్ లో చర్చ జరగడమే ఒక పెద్ద అద్భుతం. మరి ఈ పురుషుల కమిషన్ ముచ్చట ఎంతవరకు వెళ్తుందో అధికార పక్షం దీనిపై ఎలాంటి 'పంచ్‌లు' వేస్తుందో చూడాలి. అంతవరకు.. ఆల్ ది బెస్ట్ మగాళ్లూ! మీ బాధలను వినడానికి కనీసం ఒక బిల్లు అయినా పుట్టుకొచ్చింది, సంతోషించండి.. ఇది పద్ధతి కాదు.. ఇది విధానం కాదు.. దీనికి పాడాలి చరమగీతం అన్నట్టుగా మాట్లాడుతున్నారు.ఇటీవల కాలంలో మగవాళ్ళను ప్రియురాళ్లు, భార్యలు చంపేస్తున్న నేపథ్యంలో.. ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి. పెళ్లి చేసుకోవాలంటే మగవాళ్ళు భయపడిపోతున్నారు. అసలు ఇలా కూడా జరుగుతుందా.. ఇలా ప్రాణాలు తీస్తుంటే ఇక పెళ్లిళ్లు ఎందుకు చేసుకోవాలని మగవాళ్ళు ప్రశ్నిస్తున్నారు. ఒంటరి జీవితమే బాగుంటుందని.. ఒంటరిగా మిగిలిపోవడమే గొప్పగా ఉంటుందని భావిస్తున్నారు. మగవాళ్ళ బాధలు చూడలేక కొన్ని సందర్భాలలో రాజకీయ నాయకులూ స్పందిస్తున్నారు. తాజాగా అశోక్ కుమార్ అనే రాజ్యసభ సభ్యుడు పెద్దల సభలో కీలక వ్యాఖ్యలు చేశాడు. మగవాళ్ళ మీద రోజురోజుకు దాడులు పెరిగిపోతున్నాయని.. మగవాళ్ళను చంపేస్తున్నారని.. మగవాళ్ళ ప్రాణాలకు గ్యారెంటీ లేకుండా పోయిందని.. చెబుతూ.. మగ వాళ్లకు కూడా కమిషన్ ఏర్పాటు చేయాలని.. ఆడవాళ్ళ నుంచి మగవారిని కాపాడాలని ఆయన సాక్షాత్తు పెద్దల సభలో వ్యాఖ్యానించడం విశేషం. అయితే ఆయన చేసిన వ్యాఖ్యల పట్ల మెజారిటీ ప్రజల నుంచి సానుకూల ప్రకటన రావడం గమనార్హం.

**- ఎడిటర్**

## కోర్టు కేసుల సత్వర విచారణకు సమన్వయంతో పనిచేయాలి

**కోర్టు డ్యూటీ అధికారులు, కోర్టు లైజన్ అధికారులతో సమీక్ష సమావేశం**

**బాధితులకు సత్వర న్యాయం అందేలా బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలి - జిల్లా ఎస్పీ డి.జానకి,**

మహబూబ్‌నగర్ జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ డి.జానకి, రు పోలీసు ప్రధాన కార్యాలయం కాన్ఫరెన్స్ హాల్ నందు కోర్టు డ్యూటీ అధికారులు మరియు కోర్టు లైజన్ అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, కోర్టు విచారణలో ఉన్న కేసులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, సాక్షులు సకాలంలో కోర్టుకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా తీవ్రమైన నేరాలు, మహిళలు మరియు చిన్నారులపై జరిగే నేరాలు, పోక్సో, హత్య, దోపిడీ తదితర కేసుల విచారణలో ఎలాంటి నిర్లక్ష్యం చోటుచేసుకోకుండా సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.

కోర్టు డ్యూటీ అధికారులు, కోర్టు లైజన్ అధికారులు, దర్యాప్తు అధికారులు మరియు ప్రభుత్వ అభియోగ న్యాయవాదుల మధ్య సమన్వయం మరింత మెరుగుపరచి, కేసులలో నిందితులకు శిక్షలు పడేలా పటిష్టమైన సాక్ష్యాధారాలను కోర్టులో సమర్పించాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న కోర్టు సమన్లు, వారెంట్లు, ప్రొక్లమేషన్ల అమలుపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు.




కేసుల పురోగతిని నిరంతరం సమీక్షిస్తూ, బాధితులకు సత్వర న్యాయం అందేలా ప్రతి అధికారి బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని జిల్లా ఎస్పీసూచించారు. ఈ సమీక్ష సమావేశం నందు ఆఅఖీః ఆూఖ రమణా రెడ్డి, ఆఅఖీః ఇన్స్పెక్టర్ నర్సింలు, ఎం సెల్ ూఎ రవి, కోర్టు లైజన్ అధికారులు మరియు కోర్టు డ్యూటీ అధికారులు పాల్గొన్నా.

## ముఖ్యమంత్రికి ప్రజాక్షేత్రంలో బుద్ధి చెప్తాం

**- మాజీ ప్రభుత్వ విప్ రేగా కాంతారావు**

కొత్తగూడెం : అమలుకు నోచుకోని హామీలతో అధికారంలోకి వచ్చి, అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రజాక్షేత్రంలో బుద్ధి చెబుతామని మాజీ ప్రభుత్వ విప్, బీఆర్ఎస్ జిల్లా మాజీ అధ్యక్షుడు రేగా కాంతారావు అన్నారు. భద్రాద్రి జిల్లా బీఆర్ఎస్ భవన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శనివారం ఆయన మాట్లాడారు. ఖమ్మం జిల్లా చింతకాని పర్యటనలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఆయన ఖండించారు. పాలన చేతగాక ప్రతిపక్ష నాయకులను దూషించడం సరైంది కాదన్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలు చేయలేదని విమర్శించారు. హామీలు అమలు చేయడం చేతగాని ముఖ్యమంత్రి, కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావు లను విమర్శించడమే పనిగా పెట్టుకున్నారన్నారు. బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ రాష్ట్రం అభివృద్ధిలో అగ్రభాగాన నిలిచిందని, నేటి కాంగ్రెస్ పాలనలో అన్ని రంగాల్లో దివాలా తీసి అప్పులపాలు అయిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి చేతనైతే రాజీనామా చేసి ఎన్నికల్లో గెలవాలని సవాల్ విసిరారు. ప్రాజెక్టులపై కనీసం అవగాహన లేని ముఖ్యమంత్రిని ప్రజలు అసహ్యించుకుంటున్నట్లు



తెలిపారు. రానున్న ఎన్నికల్లో ఖమ్మం జిల్లాలో పది స్థానాలు బీఆర్ఎస్ గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ నేతలపై అవాకులు చవాకులు పేలితే కార్యకర్తలు చూస్తూ ఊరుకోరని తగిన రీతిలో బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఈ సమావేశంలో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి, మాజీ వైస్ చైర్మన్ వేల్పుల దామోదర్, అనుదీప్, రాజు గౌడ్, రవిచంద్ర, సిందూ తపస్వి, లావుడియా సత్యనారాయణ, కొట్టి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## ఆరోగ్యకరమైన అలవాట్లు? ఆనందకర బాల్యం

**- రుద్రంపూర్‌లో జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవ ర్యాలీ**

కొత్తగూడెం : పిల్లల్లో నులి పురుగుల సమస్యను నివారించి, వారి ఆరోగ్యవంతమైన ఎదుగుదలను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం జూలై 13న జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవంను నిర్వహించనుంది. ఈ కార్యక్రమంలో భాగంగా 1 నుంచి 19 సంవత్సరాల వయస్సు గల పిల్లలు, యువతకు అల్బెండజోల్ మాత్రలను ఉచితంగా అందజేయనుంది. ఇందులో భాగంగా చుంచుపల్లి మండలం, రుద్రంపూర్ పంచాయతీ పరిధిలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులచే మల్టీ పర్పస్ హెల్త్ అసిస్టెంట్ ఏ.నాగ కుమారి ఆధ్వర్యంలో శనివారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... నులి పురుగులు కలుషిత ఆహారం, నీరు, పరిశుభ్రత లోపం వల్ల శరీరంలోకి ప్రవేశించి పిల్లల్లో పోషకాహార లోపం, రక్తహీనత, కడుపు నొప్పి, ఎదుగుదల మందగించడం వంటి సమస్యలకు దారితీస్తాయన్నారు. ఈ నేపథ్యంలో పిల్లలకు ఆరోగ్య శాఖ సూచించిన మేరకు నులి పురుగుల నివారణ మాత్రలు తప్పనిసరిగా వేయించాలని సూచించారు. ఆరోగ్య నిపుణులు సూచించిన ముఖ్య జాగ్రత్తల్లో భోజనానికి ముందు, మరుగుదొడ్డి ఉపయోగించిన తర్వాత చేతులు



సబ్బుతో కడుక్కోవడం, గోళ్లను శుభ్రంగా ఉంచుకోవడం, చెప్పులు ధరించడం, మరుగుదొడ్లను వినియోగించడం, సురక్షితమైన తాగునీరు సేవించడం, ఆహారాన్ని పరిశుభ్రంగా తయారు చేసి, మూతపెట్టి ఉంచడం ఉన్నాయి. అలాగే నులిపురుగుల నివారణ మాత్రలు పూర్తిగా సురక్షితమైనవని, అవి పిల్లల ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషిస్తాయని వైద్యాధికారులు తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు తప్పనిసరిగా మాత్ర వేయించి, ఆరోగ్యవంతమైన భవిష్యత్‌కు తోడ్పడాలని విజ్ఞప్తి చేశారు. "ఆరోగ్యకరమైన అలవాట్లు ? ఆనందకర బాల్యం" అనే నినాదంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆరోగ్య శాఖ పిలుపులో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్ సుభద్రమ్మ, పాఠశాల ప్రధాన ఉపాధ్యాయురాలు సత్యవతి, టీచర్ రాజరాజేశ్వరి, విద్యార్థులు పాల్గొన్నారు.

## దోషులకు శిక్ష పడేలా ..

**బాధితులకు న్యాయం జరిగేలా అండగా ఉంటాం: ఎమ్మెల్యే డా.ఆర్.భూపతి రెడ్డి**

**కువైట్ లో మృతి చెందిన బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ**

**కోరట్ పల్లి లో ఎమ్మెల్యే పర్యటన**

**బాధిత కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా**



నిజామాబాద్ జూలై 11 : ఇటీవల కువైట్ దేశంలో హత్యకు గురైన గుగ్లోత్ కైలాస్ కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉండడంతో పాటు నిందితులకు శిక్ష పడేలా చూస్తామని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డా.ఆర్.భూపతి రెడ్డి పేర్కొన్నారు. శనివారం డిచ్ పల్లి మండలం కొరట్ పల్లి తండా లో బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్యే పరామర్శించారు. ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని కల్పించారు. కొడుకును కోల్పోయిన తల్లితండ్రులు ఎమ్మెల్యే వద్ద కన్నీరుమున్నీరయ్యారు. ఎలాగైనా తమకు న్యాయం చేయాలని వేడుకున్నారు. స్థానిక పోలీసుల నుండి పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. పరారీలో ఉన్న మరొకరిని అదుపులోకి తీసుకునేందుకు చర్యలు వేగవంతం చేయాలని ఆదేశించారు. కాగా తక్షణ సాయంగా రూ. 10 వేలు కుటుంబానికి అందజేశారు.ఈ మేరకు ఎమ్మెల్యే వారికి భరోసా కల్పించి మాట్లాడుతూ.. ఇటీవల కువైట్ లో కైలాస్ అనే వ్యక్తి మృతి చెందగా.. పక్క గ్రామస్తులే హత్య చేసినట్లుగా ప్రాథమిక నిర్ధారణ అయినట్లు పేర్కొన్నారు. కాగా బ్రతుకు దెరువు కోసం ఇతర దేశాలకు వెళ్లి ఉద్యోగం చేస్తున్న యువకుడు ఇలా అకాల మృతి చెందడం బాధాకరం అన్నారు. ఈ ఘటనలో ఇప్పటికే సంబంధిత అధికారులతో మాట్లాడడంతో పాటు.. ఎన్నారై రాష్ట్ర అధికారులతో మాట్లాడినట్లు చెప్పారు. బాధితులకు ప్రభుత్వం పరంగా అందాల్సిన సహాయం అందిస్తామన్నారు. అదేవిధంగా ఇప్పటికే నిందితుల్లో ఒకరిని కువైట్ లో పోలీసులు అదుపులోకి తీసుకోగా .. మరొకరు పరారీలో ఉన్నట్లు పోలీసుల ద్వారా తెలిసిందన్నారు. త్వరలోనే అతన్ని కూడా అదుపులోకి తీసుకొని చట్టప్రకారం వారికి శిక్ష పడేలా చూస్తామన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు అంబర్ సింగ్, మునిపల్లి సాయ రెడ్డి, అమృతపూర్ గంగాధర్, పోలసాని శ్రీనివాస్, తారాచంద్ నాయక్, రాంచందర్ గౌడ్, శ్యాంసన్, జహూర్, సర్పంచ్ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు

## ఈటెల వ్యూహం ఏమిటీ

కరీంనగర్, జూలై 11, (న్యూస్ పల్స్)బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ చేసిన వ్యాఖ్యలు పార్టీలో చర్చనీయాంశమయ్యాయి. తనకు తెలంగాణ రాష్ట్రం ముఖ్యమని, ఆ తర్వాతే పార్టీ అని, ఆ తర్వాతే వ్యక్తిగతమని ఆయన చేసిన వ్యాఖ్యలు పార్టీలో లోతైన చర్చకు కారణమయింది. ఈటల రాజేందర్ మావోయిస్టుల నుంచి రాజకీయాల్లోకి వచ్చారు. ఆయన తెలంగాణ రాష్ట్ర ఉద్యమం నుంచి బీఆర్ఎస్ లో పనిచేశారు. బీఆర్ఎస్ ప్రతిపక్షంలో ఉన్నా, అధికారంలో ఉన్నప్పటికీ ఆయన తనదైన ముద్రను వేసుకున్నారు. బీసీ నేతగా ఉన్న ఈటల రాజేందర్ తొలి నుంచి వివాదాలకు దూరంగా ఉన్నారు. అయితే బీఆర్ఎస్ రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత కేసీఆర్ తో పొసగకపోవడంతో పాటు ఆయన వైఖరిని వ్యతిరేకించడంతో పార్టీ నుంచి సస్పెండ్ చేశారు.. దీంతో ఈటల రాజేందర్ ఈటల రాజేందర్ బీజేపీ లో చేరారు. హుజారాబాద్ లో ఓటమి పాలయినా 2024 ఎన్నికల్లో ఈటల రాజేందర్ మల్కాజ్ గిరి నుంచి బీజేపీ తరుపున పోటీ చేసి ఎన్నికయ్యారు. అయితే సామాజికవర్గం కోటాలతోతనకు మంత్రి పదవి లభిస్తుందని ఆశించారు. కానీ రాకపోవడంతో పాటు తాను గతంలో ప్రాతినిధ్యం వహించిన హుజూరాబాద్ కు మాత్రం ఆయనను దూరం చేయడంతో పాటు పార్టీలో సరైన ప్రాతినిధ్యం కల్పించకపోవడంతో కొంత ఈటల రాజేందర్ ఇబ్బందులు పడుతున్నారని గతంలోనూ ప్రచారం జరిగింది. అయితే తిరిగి బీఆర్ఎస్ లో చేరతారన్న ప్రచారాన్ని డు ఈటల రాజేందర్ కొట్టిపారేశారు. కానీ ఇటీవల ఒక వివాహ వేడుకలో మాజీ మంత్రి కేటీఆర్ ను కలవడం, ఆయన కుటుంబ సభ్యులతో కలసి మాట్లాడటంతో మరొకసారి ఈ ప్రచారం ఊపందుకుంది. కానీ ఈటల రాజేందర్ మాత్రం తాను బీజేపీలోనే కొనసాగుతానని చెబుతున్నారు. కానీ ఆయన ఉన్నట్లుండి తనకు తెలంగాణ ముఖ్యమని ఎందుకన్నారు? పార్టీ తర్వాతేనని అన్న మాటకు అర్థం ఏంటన్న దానిపై కూడా బీజేపీ రాష్ట్ర నేతలు ఆరా తీస్తున్నారు. ఈటల బీజేపీలో ఇమడలేకపోతున్నారన్న చర్చ జోరుగా సాగుతోంది. మొదట తనకు మంత్రిగా అవకాశం వస్తుందనుకున్నారు. ఆ తర్వాత బీజేపీ అధ్యక్ష పదవి దక్కుతుందన్న ప్రచారం జరిగినా, ఎప్పటికప్పుడు చెక్ పెడుతూ వచ్చారు తన వైరి వర్గం నేతలు. ఆ తర్వాత కొంత సైలెంట్ గా ఉన్నా, కాళేశ్వరం విషయంలో ఈటల రాజేందర్ దూకుడుగా మాట్లాడుతున్న తీరు ఇప్పుడు చర్చనీయాంశం అయ్యింది.కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ వద్ద ఉన్న కన్నేపల్లి పంప్ హౌజ్ నుండి వాటర్ లిఫ్టింగ్ పై కొంతకాలంగా కాంగ్రెస్–బీఆర్ఎస్ మధ్య మాటల యుద్ధం నడుస్తోంది. బీజేపీ దాదాపు సైలెంట్ గా ఉన్నా, ఈటల మాత్రం వాయిస్ బీఆర్ఎస్ కు అనుకూలంగా పెంచుతూ వస్తున్నారు. అవినీతి వల్ల మేడిగడ్డ కుంగింది, వాటర్ లిఫ్టింగ్ సాధ్యం కాదని సీఎం రేవంత్, ప్రభుత్వం వాదిస్తుంటే? వాటర్ లిఫ్టింగ్ సాధ్యమేనని బీఆర్ఎస్ వాదిస్తుంది. బీఆర్ఎస్ వాదనను ఎంపీ ఈటల స్ట్రాంగ్ గా సపోర్ట్ చేస్తూ వస్తున్నారు.అవినీతి విషయంలో, అరెస్టుల విషయంలోకి నేను రాను. కానీ కన్నేపల్లి వద్ద ప్రభుత్వం రాజకీయంగా చూస్తూ వాటర్ లిఫ్ట్ చేయటం లేదన్నది ఈటల వాదన. తాను ఎవరో మాట్లాడిస్తే మాట్లాడే వాడిని కాదని, తెలంగాణ మట్టిబిడ్డను, ఉద్యమకారుడిని కాబట్టి అడుగుతున్నా. రైతుల కోసం ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూనే ఉంటానంటూ ఈటల మరోసారి స్పందించారు.ఇటీవల మాజీ ఎంపీ వినోద్ కొడుకు పెళ్లిలో కేటీఆర్ దంపతులతో ఈటల ఉన్న వీడియోలు వైరల్ కావటం, ఇప్పుడు ఉద్యమకారుడిని అంటూ చెప్తూనే కాళేశ్వరం విషయంలో బీఆర్ఎస్ వాదనతో ఏకీభవించటం, బీజేపీలో ఉన్న గ్రూప్ రాజకీయాలను చూస్తుంటే? ఈటల మనసు మారుతోందా? అన్న అనుమానాలు బలపడుతున్నాయని, రాజకీయాల్లో శాశ్వత శత్రువులు– శాశ్వత మిత్రులు ఉండరన్న విషయం మర్చిపోరాదని విశ్లేషకులు గుర్తు చేస్తున్నారు.యాధృచ్ఛకంగా అన్న మాటలేనా? లేక ఇందులో ఏదైనా అంతరార్థం ఉందా? అన్న అనుమానాలు కూడా ఉన్నాయి. అయితే ఆయన బీఆర్ఎస్ లో చేరనని చెప్పడంతో బీజేపీలోనే కొనసాగుతూ తన అసంతృప్తిని వెళ్లగక్కే అవకాశముందని కూడా అంటున్నారు. తనను కేవలం ఒక ప్రాంతానికే పరిమితం చేయడంపైన కూడా ఈటల రాజేందర్ గుర్రుగా ఉన్నట్లు సమాచారం. తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాల కోసం ఎంత వరకైనా పోరాడాతానని ఈటల అనడం పైనా కూడా సోషల్ మీడియాలో వివిధ కామెంట్స్ వినపడుతున్నాయి. ఇప్పటికే బండి సంజయ్, కిషన్ రెడ్డిలతో ఈటల రాజేందర్ కు అంత సంబంధాలు మంచిగా లేవని, ఈటల రాజేందర్ ఎందుకు అన్నారన్నది కాలమే నిర్ణయిస్తుందని అంటున్నారు.

## మూడింటిలో రెండు కార్పొరేషన్లపై గురి

హైదరాబాద్, జూలై 11, (న్యూస్ పల్స్): తెలంగాణ రాజకీయాల్లో తదుపరి సమరం హైదరాబాద్ మహానగరం వేదికగా ప్రారంభం కానుంది. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ లో కాంగ్రెస్ ప్రభుత్వం పాత 1955 నాటి యాక్ట్‌ను రద్దు చేసి పాత గ్రేటర్‌ను మూడు స్వతంత్ర కార్పొరేషన్లుగా విభజించి, డివిజన్ల సంఖ్యను 150 నుండి ఏకంగా 300 కి పెంచి ఎన్నికలు నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేస్తోంది. కాంగ్రెస్ వేస్తున్న ఈ త్రిశూల వ్యూహాన్ని తిప్పికొట్టి, హైదరాబాద్‌పై ఎలాగైనా జెండా ఎగరేయడమే లక్ష్యంగా భారతీయ జనతా పార్టీ హైకమాండ్ తన వ్యూహాలకు పదును పెట్టింది.ఇందులో భాగంగానే ఇటీవల బీజేపీ నూతన జాతీయ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన అత్యంత యువ లీడర్ నితిన్ నవీన్ హైదరాబాద్‌లో మూడు రోజుల పాటు సుదీర్ఘంగా పర్యటించి, రాష్ట్ర కోర్ కమిటీ నేతలకు గట్టి వార్నింగ్ , దిశానిర్దేశం చేసి వెళ్లారు. నితిన్ నవీన్ తన అంతర్గత సమావేశాల్లో రాష్ట్ర నేతలకు అత్యంత స్పష్టమైన సందేశాన్ని ఇచ్చారు. పట్టణ ప్రాంతాలు, ముఖ్యంగా హైదరాబాద్ వంటి కాస్మోపాలిటన్ సిటీలు ఎప్పుడూ బీజేపీకి బలమైన కోటలు. లోక్‌సభ ఎన్నికల్లో హైదరాబాద్ చుట్టుపక్కల ఎంపీ స్థానాలు గెలిచినంత మాత్రాన సరిపోదు.. ఈ మూడు కార్పొరేషన్ల ఎన్నికల్లో మన సత్తా చాటకపోతే, తెలంగాణలో అధికారం చేపడతామనే బీజేపీ కల భవిష్యత్తులో కేవలం కలగానే మిగిలిపోతుంది అని ఆయన కుండబద్దలు కొట్టారు. నేతల మధ్య ఉన్న అంతర్గత విభేదాలను పక్కనబెట్టి, కలిసికట్టుగా పోరాడకపోతే జరిగే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. గ్రేటర్‌ను విభజించడం వెనుక కాంగ్రెస్ పొలిటికల్ స్కెచ్ ఉంది. ఓల్డ్ సిటీ పరిధిలోని హైదరాబాద్ , ఐటీ కారిడార్ ఉన్న సైబరాబాద్ , ఉద్యోగులు–మధ్యతరగతి ఎక్కువగా ఉండే మల్కాజ్‌గిరి .. ఈ మూడింటికీ వేర్వేరు వ్యూహాలు కావాలని నితిన్ నవీన్ స్పష్టం చేశారు.

# ఘనంగా బండి సంజయ్ జన్మదిన వేడుకలు

వేములవాడ, జులై 11: వేములవాడ అర్బన్ మండల బీజేపీ అధ్యక్షుడు బుర్ర శేఖర్ గౌడ్ ఆధ్వర్యంలో కరీంనగర్ ఎంపీ, కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అగ్రహారం ఆంజనేయస్వామి ఆలయంలో బండి సంజయ్ పేరుతో ప్రత్యేక పూజలు నిర్వహించి, ఆయన ఆయురారోగ్యాలతో ప్రజాసేవలో మరింత ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ప్రార్థించారు. అనంతరం భక్తులకు పండ్లు పంపిణీ చేశారు. నంది కమాన్ చౌరస్తాలో నాయకులు, కార్యకర్తల సమక్షంలో



కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలను ఉత్సాహంగా జరుపుకున్నారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకుడు లింగంపల్లి శంకర్, జిల్లా కౌన్సిల్ సభ్యుడు చింతపల్లి వెంకటేశ్వరరావు, జింక అనిల్, చంద్రగిరి ప్రశాంత్, గుండెకార్ల లక్ష్మణ్, ఎరుగోకుల రమేష్, చల్ల నరసయ్య, పేరంగాని మల్లేశం, కంసాని రాము, సంజీవరెడ్డి, పడగేల బాబు, నాంపల్లి తిరుపతి, రెడ్డవేని రాజు, పోచంపల్లి భాను, ఎడ్ల హరీష్, చర్ల దేవరాజ్, జింక శేఖర్, లింగంపల్లి సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు ఉపాధ్యాయులే మార్గదర్శకులు

**గురువును గౌరవించడం అంటే సమాజాన్ని గౌరవించడమే సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్**

**ఉపాధ్యాయులు వృత్తి నైపుణ్యాలను నిరంతరం మెరుగుపరుచుకోవాలి**

**స్వామి బోధమయానంద మహారాజ్**

సత్తుపల్లి, జులై 11 : విద్యార్థులకు కేవలం మార్కులే కాకుండా క్రమశిక్షణ, నైతికత, మానవీయ విలువలను పెంపొందించే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని హైదరాబాద్ రామకృష్ణ మఠం అధ్యక్షులు స్వామి బోధమయానంద మహారాజ్ పేర్కొన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ఉపాధ్యాయులు నిరంతరం కొత్త విషయాలు నేర్చుకుంటూ తమ వృత్తి నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని సూచించారు.

శనివారం సత్తుపల్లిలోని మాదరి ఫంక్షన్ హాల్‌లో రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో, సత్తుపల్లి డివిజన్ ప్రైవేట్ పాఠశాలల సౌజన్యంతో నిర్వహించిన ఉపాధ్యాయ వృత్తి నైపుణ్య శిక్షణ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆదర్శ సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుని పాత్ర అత్యంత కీలకమని అన్నారు. ఒక గొప్ప లక్ష్య సాధన కోసం ప్రతి ఉపాధ్యాయుడు అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. "విద్యార్థుల భవిష్యత్తు రూపుదిద్దుకునేది పార్లమెంటులో కాదు... పాఠశాలలో" అని వ్యాఖ్యానిస్తూ, విద్యార్థుల్లో జ్ఞానంతో పాటు సంస్కారం, సేవాభావం, బాధ్యతను పెంపొందించాల్సిన అవసరాన్ని వివరించారు.

మైసూర్ రామకృష్ణ మిషన్‌కు చెందిన స్వామి మహా మేధానంద మాట్లాడుతూ, ఉపాధ్యాయులు విద్యార్థుల్లో మానవతా విలువలు, క్రమశిక్షణ, బాధ్యతాభావాన్ని పెంపొందించే దిశగా కృషి చేయాలని సూచించారు. విజయవాడ రామకృష్ణ మిషన్ ఉప కార్యదర్శి స్వామి శితికంటానంద మహారాజ్ మాట్లాడుతూ, ఉపాధ్యాయ వృత్తి ఒక తపస్సు లాంటిదని, దానిని ప్రేమతో నిర్వర్తించాలని అన్నారు. విద్యార్థులను సొంత బిడ్డల్లా భావించి వారి వ్యక్తిత్వ వికాసానికి కృషి చేయాలని సూచించారు.

కార్యక్రమంలో పాల్గొన్న సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్ట రాగమయి దయానంద మాట్లాడుతూ, గురువును గౌరవించడం అంటే సమాజాన్ని గౌరవించడమేనని అన్నారు. ఉపాధ్యాయులు నిరంతరం నేర్చుకుంటూ, ప్రేమతో బోధిస్తూ, సమయపాలన పాటిస్తూ ప్రతి విద్యార్థిని సొంత బిడ్డగా భావించి వారి విజయాన్నే తమ విజయంగా భావించినప్పుడే నిజమైన గురువులుగా నిలుస్తారని పేర్కొన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో డివిజన్‌లోని వివిధ ప్రైవేట్ పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో విద్యాబోధనలో ఆధునిక విధానాలు, విలువలతో



కూడిన విద్య, విద్యార్థుల వ్యక్తిత్వ వికాసం, ఉపాధ్యాయుల బాధ్యతలు వంటి అంశాలపై పలు సూచనలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. మున్సిపల్ చైర్ పర్సన్ రెహానా కమల్, మార్కెట్ కమిటీ చైర్మన్ దోమ ఆనంద్ బాబు మండల విద్యాధికారి నక్క రాజేశ్వర్ రావు ప్రైవేటు పాఠశాలల నిర్వహకులు పసుపులేటి నాగేశ్వరావు (విశ్వశాంతి) నాయుడు వెంకటేశ్వరరావు (మదర్ తెరిసా) చీకటి శ్రీనివాసరావు (గీతాంజలి) పులి శ్రీనివాసరావు (టాలెంట్) వాణి విద్యాలయం ఉపాధ్యాయులు చల్లగోళ్ల అప్పారావు గట్టే వాసు సత్తుపల్లి పట్ట ప్రముఖులు అధికారులు తదితరులు పాల్గొన్నారు

# హుగ్గెల్లిలో ఎస్ఐఆర్ పై అవగాహన–హెల్ప్ డెస్క్ ఏర్పాటు

**-పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పీఎన్ఆర్, సర్పంచ్ విమల**

జహీరాబాద్ జులై 11: జహీరాబాద్ మండలం హుగ్గెల్లి గ్రామంలో గ్రామ సర్పంచ్ పట్లోళ్ళ విమల శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎస్ఐఆర్ ఫారాలను పూరించే విధానంపై శనివారం ప్రజలకు ఒక ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సంబంధిత దరఖాస్తులను ఎటువంటి తప్పులు లేకుండా ఎలా పూర్తి చేయాలనే దానిపై ఈ సందర్భంగా గ్రామస్థులకు స్పష్టమైన సూచనలు మరియు సలహాలు అందించారు. ?ప్రజల సౌకర్యార్థం ఈ కార్యక్రమంలో భాగంగా ప్రత్యేకంగా ఎస్ఐఆర్ హెల్ప్ డెస్క్‌ను ఏర్పాటు చేశారు. ఈ డెస్క్ ద్వారా గ్రామస్థులు తమ ఫారాలను సులభంగా పూర్తి చేయడానికి అవసరమైన సహాయాన్ని నేరుగా పొందే వీలు కల్పించారు. ఈ కార్యక్రమానికి జహీరాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పట్లోళ్ళ నర్సింహారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫారాల పూరింపులో ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను సవివరంగా వివరించారు. అర్హులైన ప్రతి



ఒక్కరికీ లబ్ధి చేకూరేలా, దరఖాస్తులను సరైన పద్ధతిలో నింపాలని సూచించారు. గ్రామస్థులు సందేహాలను నివృత్తి చేసి, ఫారాలు పూర్తి చేయడంలో వారికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ యంపిపి రాములు, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నర్సింహారెడ్డి,యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి జగదీశ్వర్ రెడ్డి, సీనియర్ నాయకులు నర్సింహులు, యూత్ కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు కుమ్మరి రాజు, ఇమామ్ పటేల్, మునిందర్ రెడ్డి, వెంకట్ రెడ్డి, బాల్ రాజు, నరేష్, రాజశేఖర్, సిద్దారెడ్డి, మాణయ్య, పాండు, ముస్తఫా, ఇంద్రారెడ్డి, అశోక్, రాజు, అధికారులు పాల్గొన్నారు.

# ఘనంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ జన్మదిన వేడుకలు

**- సేవా కార్యక్రమాల్లో మేయర్ కొలగాని శ్రీనివాస్**

కరీంనగర్, జులై 11: కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్ జన్మదిన వేడుకలు శనివారం కరీంనగర్ నగరంలో ఘనంగా నిర్వహించారు. నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ ఆధ్వర్యంలో నగరవ్యాప్తంగా వివిధ సేవా కార్యక్రమాలు, అన్నదానాలు, రక్తదాన శిబిరాలు, వైద్య శిబిరాలు నిర్వహించారు.

తీగలగుట్టపల్లిలోని శ్రీ కోదండరామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన మేయర్ కొలగాని శ్రీనివాస్, బండి సంజయ్ ఆయురారోగ్యాలతో ప్రజాసేవలో మరిన్ని విజయాలు సాధించాలని ప్రార్థించారు. అనంతరం తెలంగాణ చౌక్‌లో ఏర్పాటు చేసిన 54 కిలోల కేక్‌ను కట్ చేసి కార్యకర్తలతో కలిసి జన్మదిన వేడుకలు జరుపుకున్నారు.

బస్టాండ్ ఎదుట, టవర్ సర్కిల్ ప్రాంతాల్లో అన్నదాన కార్యక్రమాల్లో పాల్గొని అన్నప్రసాదం పంపిణీ చేశారు. వీరబ్రహ్మేంద్ర స్వామి వృద్ధాశ్రమంలో వృద్ధులకు పండ్లు, దుప్పట్లు అందజేశారు. పార్లమెంట్ కార్యాలయం, నాకా చౌరస్తాలో నిర్వహించిన రక్తదాన శిబిరాలను సందర్శించి రక్తదాతలను




అభినందించారు.

35వ డివిజన్‌లో మొక్కలు నాటి, ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. శిబిరంలో ఈసీజీ, 2డీ ఈకో, బీపీ, షుగర్ తదితర ఆరోగ్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. మంచిర్యాల చౌరస్తాలోని వికలాంగుల ఆశ్రమంలో పండ్లు పంపిణీ చేయగా, ప్రభుత్వ సివిల్ ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన అల్పాహార పంపిణీ కార్యక్రమంలో కూడా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ, బండి సంజయ్ కార్పొరేటర్ స్థాయి నుంచి కేంద్ర మంత్రి స్థాయికి ఎదిగి ప్రజల మధ్యే ఉండే నాయకుడిగా గుర్తింపు పొందారని కొనియాడారు. ఆయన స్ఫూర్తితో ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తామని తెలిపారు.

ఈ కార్యక్రమాల్లో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, డిప్యూటీ మేయర్ వై. సునీల్‌రావు, కార్పొరేటర్లు, కో–ఆప్షన్ సభ్యులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఘనంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ జన్మదిన వేడుకలు:

**కేక్ కటింగ్ , స్వీట్ల పంపిణీ, ప్రత్యేక పూజలు , అన్నదాన కార్యక్రమం , సేవా కార్యక్రమాలతో హోరెత్తించిన బిజెపి శ్రేణులుు**

కరీంనగర్, జులై 11: కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ జన్మదిన వేడుకలు శనివారం రోజున కరీంనగర్ పరిసర ప్రాంతాల్లో ఎంతో ఘనంగా, ఉత్సాహభరితంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆయన అభిమానులు, భారతీయ జనతా పార్టీ నాయకులు, కార్యకర్తలు వివిధ ప్రాంతాల్లో కేక్ కటింగ్ వేడుకలతో పాటు, అనేక సేవా కార్యక్రమాలను నిర్వహించారు.

కరీంనగర్ పట్టణం నార్త్ జోన్ : కేంద్ర మంత్రివర్యులు బండి సంజయ్ కుమార్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని జోన్ అధ్యక్షులు పాదం శివరాజ్ ఆధ్వర్యంలో స్థానికంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కేక్ కట్ చేసి, స్వీట్లను పంపిణీ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో చిగురి రవీంద్ర, కొమ్మెర రవీంద్ర రెడ్డి, పైడి ప్రసాద్, నేదునూరి అనిల్, వినయ్, నిఖిల్, కరుణాకర్, యుగేందర్ రెడ్డి, జితేందర్ రెడ్డి పలువురు పాల్గొన్నారు.

గన్నేరువరంలో: గన్నేరువరం మండల అధ్యక్షులు తిప్పర్తి నికేష్ ఆధ్వర్యంలో కార్యకర్తలు ఉత్సాహంగా కేక్ కట్ చేసి, అందరికీ స్వీట్లు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో ఏలేటి చంద్రారెడ్డి, జిల్లా ఓబీసీ మోర్చా కార్యవర్గ సభ్యులు మచ్చ బాలరాజు,మండల ప్రధాన కార్యదర్శులు పుల్లెల రాము,బొమ్మాడి సురేందర్ రెడ్డి,మండల ఉపాధ్యక్షులు గాలిపెల్లి శంకర్, కార్యదర్శి చెక్కిళ్ల చంద్రయ్య,గన్నేరువరం 8వ వార్డు సభ్యులు మచ్చ సాయికృష్ణ, మండల కార్యవర్గ సభ్యులు గూడూరి జగన్, మునిగంటి లింగయ్య, జాలి శ్రీనివాస్ రెడ్డి, ఎష్ట్ర రాజు కుమార్, బూత్ అధ్యక్షులు బోయిని వేణు, హనుమండ్ల రాజిరెడ్డి, రామిడి కృష్ణమూర్తి, దానవేణి ప్రశాంత్,దొగ్గలి జగన్,నాయకులు పుల్లెల జగన్, కొలుపుల వేణు,కుర్ర హరీష్, రంగనవేణి సంతోష్, నల్ల జైపాల్ రెడ్డి, టేకు అనిల్, కూన ప్రశాంత్,గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

తిమ్మాపూర్: తిమ్మాపూర్ మండల అధ్యక్షులు చింతం శ్రీనివాస్ ఆధ్వర్యంలో కేంద్ర మంత్రివర్యులు బండి సంజయ్ కుమార్ పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నుస్తులాపూర్ లోకేక్ కట్ చేసి స్వీట్లు పంచుతూ సంజయ్ కుమార్ కి శుభాకాంక్షలు తెలియజేశారు. బీజేవైఎం మహాత్మా నగర్ నాయకులు దుర్శటి అజయ్ , ప్రేమ్ చంద్ ఆధ్వర్యంలో స్థానిక శ్రీ మృత్యుంజయ శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలోరాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఇనుకొండ నాగేశ్వర్ రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి బొంతల కళ్యాణ్ చంద్ర తిమ్మాపూర్



మండల అధ్యక్షులు చింతం శ్రీనివాస్, మాజీ మండల అధ్యక్షులు సుగుర్తి జగదీశ్వర్ చారి, ప్రధాన కార్యదర్శి గొట్టిముక్కల తిరుపతి రెడ్డి, బీజే వైఎం మండలాధ్యక్షులుగడ్డం అరుణ్, జిల్లా నాయకులు కొయ్యడ శ్రీనివాస్, గడ్డం శ్రీనివాస్ రెడ్డి,బుర్ర శ్రీనివాస్ గౌడ్, బూట్ల శ్రీనివాస్, జాడి రాజు ,పుట్ట ఓం కార్,బండి స్వామి, దర్శెట్ రమేశ్,గాండ్ల రాము,వేల్పుల ఓదెలు, ధోనపాటి ప్రదీప్ రెడ్డి, కామెర వెంకటేష్, పిస్కా కృష్ణ, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

కొత్తపల్లి రూరల్:లిలి కొత్తపల్లి రూరల్ అధ్యక్షులు కుంట తిరుపతి ఆధ్వర్యంలో కేంద్ర మంత్రివర్యులు బండి సంజయ్ కుమార్ జన్మదినోత్సవ వేడుకలు విశేషంగా జరిగాయి. కేక్ కటింగ్, స్వీట్ల పంపిణీతో పాటు, రక్తదాన శిబిరాన్ని నిర్వహించి సామాజిక బాధ్యతను చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మండలాధ్యక్షుడు కడార్ల రతన్ , మండల ముఖ్య నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

కరీంనగర్ నగరం (7వ డివిజన్: కరీంనగర్ నగరపాలక సంస్థ ఏడో డివిజన్ కాంటెస్టెడ్ కార్పొరేటర్ తోట సాగర్ ఆధ్వర్యంలో కేక్ కటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా నిరుపేదలకు అన్నదానం చేసి సేవా కార్యక్రమాన్ని చేపట్టారు.

ఈ వేడుకల్లో బిజెపి నాయకులు తోట సతీష్ , కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# నాగర్‌కర్నూల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వ్యాస రచన పోటీలు

ప్రపంచ జనాభా దినోత్సవం - 2026 సందర్భంగా నాగర్‌కర్నూల్ ప్రభుత్వ డిగ్రీ ి పి.జి కళాశాల (ఆర్ట్స్ ి కామర్స్) ఆధ్వర్యంలో శుక్రవారం వ్యాస రచన పోటీ ఘనంగా నిర్వహించారు.

ఈ కార్యక్రమాన్ని కళాశాల ఎకనామిక్స్ విభాగం మరియు నాగర్ కర్నూల్ లయన్స్ క్లబ్ సంయుక్తంగా ఏర్పాటు చేశాయి. "యువత ఆశలు ఆకాంక్షలు నేడు మరియు భవిష్యత్తు కోసం సాకారం చేయడం"

అనే అంశంపై విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని వ్యాసాలు రాశారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ డా. కె. గీతాంజలి గారు అధ్యక్షత వహించారు.

లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ అమరేందర్ రెడ్డి ఆధ్వర్యంలో క్లబ్ సభ్యుడు వాస రాఘవేందర్ ఆర్థిక సహకారం తో విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేసారు.

కార్యక్రమానికి సమన్వయ కర్తగా డా. రాత్లావత్ కృష్ణ వ్యవహరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డా. కె. గీతాంజలి



మాట్లాడుతూ యువత ఆశలు, ఆకాంక్షలను సాకారం చేసుకోవడానికి విద్య, నైపుణ్యాలు, ఆరోగ్యం ఎంతో కీలకమని అన్నారు. జనాభా సమస్యలు, స్థిరమైన అభివృద్ధిలో యువత పాత్ర గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. బహుమతులు అందించిన లయన్స్ సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమం లో లయన్స్ మాజీ అధ్యక్షులు రామ కృష్ణా రెడ్డి మరియు అధ్యాపకులు ,విద్యార్థులు పాల్గొన్నారు.

# జిల్లా కేంద్రంలో అఖిలపక్ష విద్యార్థి సంఘాల సమావేశం

జులై 11: విద్యాహక్కు చట్టాన్ని అమలు చేయాలి.

జిల్లా కేంద్రంలో లోని బాబు జగ్జీవన్ రామ్ భవన్లో బి ఎస్ ఎఫ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సమావేశంలో వివిధ విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొని విద్యాహక్కు చట్టం ఏర్పడి 15 సంవత్సరాలు దాటిన నేటికీ అమలుకు నోచుకోవడం లేదని వాపోయారు. ప్రభుత్వాలు మారుతున్నాయే తప్ప పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందడం లేదని, ప్రభుత్వ పాఠశాలల్లో అరకొర వసతుల మధ్య సతమతమవుతున్నారని వాపోయారు. శిథిలావస్థకు చేరుకున్న పాఠశాల భవనాలకు నూతన భవనాలు నిర్మించాలని, తక్కువ విద్యార్థులు ఉన్నారనే కారణం చేత పాఠశాలలను మూసివేయరాదని వసతులు మెరుగుపరిస్తే విద్యార్థుల సంఖ్య పెరుగుతుందన్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో 25% పేద విద్యార్థులకు ప్రవేశాలు కల్పించాల్సిందేనని లేనిపక్షంలో అన్ని విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో బి ఎస్ ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ ,యూఎస్ఎఫ్ఐ నాయకులు సయ్యద్, ఎం ఎస్ ఎఫ్ జిల్లా నాయకులు మహేష్, బీసీ విద్యార్థి సంఘం నాయకులు అనిల్, ఎన్ ఎస్ యు ఐ నాయకులు వెంకటరెడ్డి , మద్దెలబండ సాయిబాబు , రామ్ చందర్ ,వెంకటేష్, బన్ని, జగదీష్ , రాము, మరియు ఇతరులు పాల్గొన్నారు.



# ప్రతి ఒక్కరికీ నాణ్యమైన వైద్య సేవలు అందాలి ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు.



భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి జూలై 11 : పినపాక నియోజకవర్గ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు శనివారం అశ్వాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ)ని సందర్శించి అక్కడి వైద్య సేవల తీరును పరిశీలించారు. ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు, రోగులకు కల్పిస్తున్న సౌకర్యాలు, మందుల నిల్వలు, వైద్య సిబ్బంది హాజరు తదితర అంశాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా ఆసుపత్రికి వచ్చిన రోగులతో ఎమ్మెల్యే నేరుగా మాట్లాడి వారికి అందుతున్న వైద్య సేవలపై అభిప్రాయాలను తెలుసుకున్నారు. ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే ప్రతి ఒక్కరికీ నాణ్యమైన వైద్య సేవలు అందేలా అధికారులు, వైద్య సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు.

ఆసుపత్రిలో అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ప్రజారోగ్యానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు, ఆరోగ్య సిబ్బంది, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మూసీ ప్రాజెక్టుపై ముందుగా పునరావాసం, పారదర్శకత అవసరం రౌండ్ టేబుల్ సమావేశంలో అభిప్రాయం




హైదరాబాద్, జూలై 11: తెలంగాణ రాష్ట్ర లోక్ దళ్ (టీఆర్ఎల్డీ) ఆధ్వర్యంలో లక్ష్మీకాపూల్‌లోని హోటల్ సెంట్రల్ కోర్ట్‌లో శనివారం మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టుపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కపిలవాయి దిలీప్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్సీ తకెళ్లపల్లి రవీందర్, ప్రొఫెసర్ హరగోపాల్ తదితరులు హాజరయ్యారు.

వక్తలు మాట్లాడుతూ మూసీ ప్రాజెక్టు అమలుకు ముందు సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్)ను ప్రజలకు వెల్లడించి, పబ్లిక్ హియరింగ్ నిర్వహించాలని కోరారు. నిర్వాసితులకు తగిన పునరావాసం, న్యాయమైన నష్టపరిహారం కల్పించిన తరువాతే ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. పారిశ్రామిక వ్యర్థాలు, డ్రైనేజీ నీరు మూసీలో కలవకుండా చర్యలు తీసుకోవడంతో పాటు మరిన్ని ఎస్టీపీలు ఏర్పాటు చేసి నదిని కాలుష్య రహితంగా మార్చాలని అభిప్రాయపడ్డారు.

మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ మాట్లాడుతూ మూసీ నది పునరుద్ధరణతో పాటు నిర్వాసితుల సంక్షేమానికి ప్రభుత్వం సమాన ప్రాధాన్యం ఇవ్వాలని అన్నారు. టీఆర్ఎల్డీ నిర్వహించిన వివిధ సమావేశాల్లో వచ్చిన సూచనలను సమగ్ర నివేదికగా రూపొందించి ముఖ్యమంత్రికి అందజేస్తామని తెలిపారు.

సమావేశంలో మాజీ ప్రజాప్రతినిధులు, నిపుణులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, సామాజికవేత్తలు, టీఆర్ఎల్డీ రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు.

# భారతీయ సంస్కృతిని విశ్వ వ్యాప్తం చేస్తున్న శ్రీ రాగ రమ్య వ్యవస్థాపకురాలు రమ్యానాయుడు





కళాకారులు భారతీయ సంస్కృతిని, ఆధ్యాత్మిక తత్వాన్ని విశ్వ వ్యాప్తంగా చేస్తున్నారని హాస్య బ్రహ్మ సీనియర్ జర్నలిస్టు శంకర్ నారాయణ అన్నారు. హైదరాబాద్ రవీంద్ర భారతిలో రమ్యా నాయుడు ఆధ్వర్యంలో రాగ రమ్య సంస్థ నిర్వహించిన సంగీత నృత్య కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇరు తెలుగు రాష్ట్రాల నుండి 160 మంది చిన్నారులు పాల్గొని తమ నృత్య ప్రదర్శనలతో చూపరులను ఆకట్టుకున్నారు. ముఖ్య అతిథిగా హాజరైన హాస్యబ్రహ్మ శంకరనారాయణ మాట్లాడుతూ కళాకారులు చేసే ప్రదర్శనల ద్వారానే దేశభక్తి పెంపొందించి ప్రపంచంలోనే ప్రఖ్యాత పేరును రాణిస్తున్నామని కొనియాడారు. కళాకారులు భారతీయ సంస్కృతిని, ఆధ్యాత్మిక తత్వాన్ని విశ్వవ్యాప్తం చేస్తున్నారని అభినందించారు.

రాగ రమ్య సంస్థ గత 8 సంవత్సరాలలో 400 కార్యక్రమాలు అద్భుతంగా నిర్వహించారని అందులో 150 ఆధ్యాత్మిక కళా కార్యక్రమాలను ప్రముఖ పుణ్య క్షేత్రాలయిన తిరుపతి, కాణిపాకం, శ్రీశైలం, కాళహస్తి, స్వర్ణగిరి దేవాలయాల్లో నిర్వహించడం ఎంతో అద్భుతమన్నారు.రాష్ట్ర మీడియా అక్రెడిటేషన్ కమిటీ సభ్యులు, ఎక్స్ లెన్సీ బుక్ ఆఫ్ రికార్డ్స్ నేషనల్ కో ఆర్డినేటర్ కదిరి వెంకట రమణా రావు మాట్లాడుతూ తాను శ్రీ రాగ రమ్య సంస్థ స్థాపించినప్పటి నుంచి ఎన్నో కార్యక్రమాలలో పాల్గొన్నానని, కళా కారుల ప్రతిభను గుర్తించి వారిని సత్కరించడం జరిగిందని అన్నారు.

శ్రీ రాగ రమ్య సంస్థ చక్కటి అభిరుచిగల కార్యక్రమాలు నిర్వహిస్తున్నదని సరస్వతీ ఉపాసకులు దైవజ్ఞ శర్మ అన్నారు. నరసింహులు శిష్యరికంలో నెమలికి నేర్పిన నడకలివే భరతనాట్య ప్రదర్శన అందరిని మంత్రముగ్ధులను చేసింది. సంగీత నృత్య గురువులు శిరీషా దేవి, సుప్రజ, నాగ జ్యోతి లలితా కామేశ్వరి, కవిత రాజ్యలక్ష్మి, నరసింహులు అనిత, రాధికా అశోక్, మేఘన ప్రణవి, ఉమాశ్రీ, గురు శరవణ, చందులు అతిథులుగా పాల్గొనడమే కాకుండా తమ శిష్యబృందాల చేత అందరినీ ఆకట్టుకునే ప్రదర్శనలు చేయడం విశేషంగా ఆకట్టుకున్నదని శ్రీ రాగ రమ్య వ్యవస్థాపకురాలు రమ్యానాయుడు అన్నారు.

# ఆల్విన్ కాలనీ ఉమ్మడి డివిజన్ బీజేపీ అధ్యక్షుడిగా చిన్నగాలోల రాజు నియామకం



భారతీయ జనతా పార్టీ శేర్లింగంపల్లి ఉమ్మడి ఆల్విన్ కాలనీ డివిజన్ అధ్యక్షుడి గా చిన్నగాలోల రాజును అధిష్టానం నియమించింది. శుక్రవారం బీజేపీ పార్టీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు వనివల్లి శ్రీనివాస్ రెడ్డి రాజు కి నియామక పత్రం అందజేసి అయన మాట్లాడుతూ రాజు లాంటి యువనాయకులు డివిజన్ లోని పార్టీ నాయకులతో కలిసి మెలిసి పని చేస్తూ రానున్న కార్పొరేషన్ ఎన్నికల్లో డివిజన్ లో బీజేపీ జెండా ఎగరవేయాలని తెలిపారు. పార్టీ లో కష్టపడి పని చేసిన ప్రతి ఒక్కరికి సముచిత స్థానం దక్కుతుందని వివరించారు.అధ్యక్షుడు గా నియమక పత్రం అందుకున్న అనంతరం రాజు మాటాడుతూ తన పై నమ్మకం ఉంచి పార్టీ ఇచ్చిన బాధ్యతను అప్పగించినందుకు అధిష్టానానికి ధన్యవాదములు తెలిపి,తప్పకుండ నెరవేర్చి డివిజన్ లో బీజేపీ జెండా ఎగరడవేసేలా కృషి చేస్తానని తెలిపారు

# మత్తు పదార్థాలకు విద్యార్థులు పూర్తిగా దూరంగా ఉండాలి, సైబర్ నేరాల పట్ల అందరు అప్రమత్తంగా ఉండాలి - ఏసీపీ ఎం.రమేష్



రామగుండం పోలీస్ కమిషనరేట్ పెద్దపల్లి జోన్ పరిధిలోని మంథని పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో మంథని గురుకుల పాఠశాలలో శనివారం మత్తు పదార్థాలపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గోదావరిఖని ఏసీపీ ఎం.రమేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు

విద్యార్థులు మత్తు పదార్థాలకు పూర్తిగా దూరంగా ఉండాలని, సామాజిక మాధ్యమాలను బాధ్యతాయుతంగా వినియోగించాలని, సైబర్ నేరాల పట్ల ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని అన్నారు. పిల్లలను సరైన మార్గంలో తీర్చిదిద్దే బాధ్యత కేవలం పోలీసులు, ఉపాధ్యాయులు లేదా వైద్యులదే కాదని, అందులో అత్యంత కీలకమైన పాత్ర తల్లిదండ్రులదేనని తెలిపారు. పిల్లల వ్యక్తిత్వ నిర్మాణం కుటుంబం నుంచే ప్రారంభమవుతుందని, చిన్నప్పటినుంచే మంచి విలువలు, క్రమశిక్షణ, బాధ్యతాయుతమైన జీవన విధానాన్ని అలవర్చాలని సూచించారు. కొంతమంది తల్లిదండ్రులు పిల్లలను గట్టిగా మందలిస్తే ఇంటి నుంచి వెళ్లిపోతారేమో లేదా ఏదైనా

అఘాయిత్యానికి పాల్పడతారేమో అనే భయంతో అవసరమైన క్రమశిక్షణను పాటించడంలో వెనుకడుగు వేస్తున్నారని తెలిపారు. పిల్లలు కొన్నిసార్లు అలాంటి మాటలతో తల్లిదండ్రులను భయపెట్టే ప్రయత్నం చేస్తారని, అలాంటి బెదిరింపులకు భయపడకుండా ప్రేమతో పాటు క్రమశిక్షణతో వారిని సరైన మార్గంలో నడిపించాలని సూచించారు. తల్లిదండ్రులు ప్రతిరోజూ పిల్లలతో మాట్లాడాలని, వారి స్నేహితుల వర్గం, మొబైల్ ఫోన్ వినియోగం, సామాజిక మాధ్యమాల వినియోగంపై నిరంతరం పర్యవేక్షణ ఉండాలని తెలిపారు. తల్లిదండ్రుల అప్రమత్తత, ప్రేమ, మార్గదర్శకత్వంతోనే పిల్లలను చెడు అలవాట్ల నుంచి కాపాడవచ్చన్నారు.

మత్తు పదార్థాల అలవాటు విద్యార్థుల భవిష్యత్తును నాశనం చేస్తుందని, వాటికి పూర్తిగా దూరంగా ఉండాలని సూచించారు. సామాజిక మాధ్యమాలు అధిక వినియోగం వల్ల చదువుపై ఏకాగ్రత తగ్గడంతో పాటు మానసిక ఆరోగ్యంపై ప్రభావం పడుతుందని వివరించారు. రోజురోజుకూ సైబర్ నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో అపరిచితుల ఫోన్ కాల్స్, సందేశాలు, లింకులు, నకిలీ వెబ్‌సైట్లు, ఆన్‌లైన్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వ్యక్తిగత బ్యాంకు వివరాలు, ఓటీపీలు, పాస్‌వర్డ్‌లు ఎవరికీ వెల్లడించవద్దని, అనుమానాస్పద సంఘటనలు ఎదురైతే వెంటనే పోలీసులకు లేదా సైబర్ హెల్ప్‌లైన్‌కు సమాచారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మంథని సీఐ బుద్ధి స్వామి, ఎస్ఐ సందీప్ కుమార్, పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# సింగరేణి అధికారుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి - సరెడ్డి పుల్లారెడ్డి



భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి జూలై 11: సింగరేణి అధికారులు సమస్యలు వెంటనే పరిష్కరించాలని గత 13 రోజులుగా సింగరేణి అధికారుల ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు చేస్తున్న సింగరేణి కి ఏ మాత్రం పట్టింపు లేదని, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు సరెడ్డి పుల్లారెడ్డి అన్నారు. శనివారం సింగరేణి అధికారుల రిలే దీక్షలను సిపిఐ పార్టీ నాయకులు సందర్శించి, తమ సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా సరెడ్డి పుల్లారెడ్డి మాట్లాడుతూ..సింగరేణి లాభాల బాటలో పయనిస్తుంటే ప్రభుత్వాలు సింగరేణిలో రాజకీయ జోక్యం చేసుకొని సింగరేణినీ కావాలని ప్రైవేట్ పరం చేయాలని కుట్ర జరుగుతుందని రాష్ట్రంలో 51% ,కేంద్రంలో 49 శాతం ఉన్న వాటా ఉన్న ప్రభుత్వాలు అధికారంలో ఉండి ఎందుకు సింగరేణి బొగ్గు బ్లాకులను ఎందుకు ప్రైవేటుపరం చేస్తున్నారని వారు ప్రశ్నించారు. సింగరేణి సంస్థ కోసం అభివృద్ధి కోసం పాటుపడే సింగరేణి అధికారులను చిన్నచూపు చూస్తుందని వారికి రావాల్సినటువంటి బెనిఫిట్స్ జీతాల అప్ గ్రేడేషన్ అమలు చేయాలని, జీతంలో భాగమైన టిఆర్పిను వెంటనే చెల్లించాలని, పారదర్శకమైన ప్రమోషన్ పాలసీ అమలు చేయాలని, సింగరేణి కి రావాల్సిన బకాయలు వెంటనే విడుదల చేయాలని, వారు న్యాయమైన కోరికని సింగరేణి పరిష్కారం చేయాలని, లేకుంటే వారితోపాటు వారికి మద్దతుగా ఆందోళన తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మహిళా సమైక్య జిల్లా కార్యదర్శి మున్నా లక్ష్మణ్ కుమారీ, సిపిఐ మణుగూరు పట్టణ కార్యదర్శి దుర్గ్యాల సుధాకర్, మండల కార్యదర్శి జక్కుల రాజబాబు, ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి గడ్డం వెంకటేశ్వర్లు, ఏఐటీయూసీ గౌరవ అధ్యక్షులు తోట రమేష్, బొగ్గుముట అధ్యక్షులు యాకూబ్ తదితరులు పాల్గొని మద్దతు ప్రకటించారు.

# గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు



భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి జూలై 11 : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలం చింతిర్యాల కాలనీలో రూ.20 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ భవనం శనివారం ప్రారంభోత్సవ కార్యక్రమంలో పినపాక నియోజకవర్గ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభించి ప్రజలకు అంకితం చేశారు. అనంతరం మాట్లాడుతూ గ్రామాల సమగ్ర అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, గ్రామస్థాయిలో ప్రజలకు మెరుగైన పరిపాలనా సేవలు అందించేందుకు అవసరమైన మౌలిక వసతులను మరింత బలోపేతం చేస్తున్నామని తెలిపారు. రూ.20 లక్షల వ్యయంతో నిర్మించిన ఈ గ్రామ పంచాయతీ భవనం ద్వారా ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత సులభంగా అందుబాటులోకి రావడంతో పాటు గ్రామాభివృద్ధికి ఇది ఎంతో దోహదపడుతుందని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో, ఎమ్మార్వో, పంచాయతీ శాఖ అధికారులు, మండల కాంగ్రెస్ అధ్యక్షులు ఓరుగంటి రమేష్ బాబు, జిల్లా ముఖ్య నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, మండల ముఖ్య నాయకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియ పై అవగాహన తప్పనిసరి

**తాజా మాజీ కార్పొరేటర్ బస్వరాజు కుమారస్వామి**

**ఎవరి పేరు మిస్ అయినా ఇప్పుడే సరిదిద్దుకోండి**



వరంగల్ బ్యూరో; భారత ఎన్నికల సంఘం చేపట్టిన ఎస్ఐఆర్ - స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియ పై 22వ డివిజన్ ప్రజలకు అవగాహన కల్పించేందుకు తాజా మాజీ కార్పొరేటర్ బస్వరాజు కుమారస్వామి ప్రత్యేక కార్యక్రమం చేపట్టారు.

శనివారం డివిజన్ లోని వివిధ కాలనీల్లో పర్యటించిన కుమారస్వామి ఇంటింటికీ వెళ్లి ఓటర్ల జాబితాలో పేర్లు ఉన్నాయో లేదో పరిశీలించాలని సూచించారు. నూతనంగా 18 ఏళ్లు నిండిన యువత, పేరు మార్పు, చిరునామా మార్పు ఉన్నవారు తప్పనిసరిగా ఫారం 6, 7, 8 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని వివరించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ

ఎస్ఐఆర్ అంటే ఓటర్ల జాబితాను క్షుణ్ణంగా సరిచూసే ప్రక్రియ అని ఎవరి పేరు మిస్సయిన ఇప్పుడే చూసుకోవాలని ఈసారి చాలా మంది పేర్లు తొలగిపోయే అవకాశం ఉందని అందుకే ప్రతి ఒక్కరూ తమ పేరు, వయసు, చిరునామా వివరాలు కరెక్ట్‌గా ఉన్నాయో చెక్ చేసుకోవాలని ఎవరికైనా అనుమానాలు ఉంటే మా ఆఫీస్‌లో గానీ, బూత్ లెవల్ ఆఫీసర్ దగ్గర గానీ సంప్రదించవచ్చు అని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో ఒక్క ఓటు కూడా వృధా కాకూడదని అన్నారు.

**కమ్యూనిటీ హాల్ లో సేవలు**

డివిజన్ లోని కమ్యూనిటీ హాల్ లో ప్రత్యేక సహాయ కేంద్రం ఏర్పాటు చేశారు. బీఎల్‌ఓలు, ఆశా వర్కర్లు కలిసి ప్రజలకు ఫారాలు నింపడంలో సహాయం చేస్తున్నారని అర్హులైన కొత్త యువ ఓటర్ల దరఖాస్తులు అక్కడికక్కడే స్వీకరించడం జరుగుతుందని

ఎస్ఐఆర్ ప్రక్రియ ఈ నెల 30 వరకు కొనసాగుతుందని, ఓటర్ హెల్ప్‌లైన్ యాప్ ద్వారా కూడా వివరాలు చెక్ చేసుకోవచ్చని కార్పొరేటర్ తెలిపారు.

**ఎస్ఐఆర్‌లో ఏం చేయాలి?**

ఐశేవతీం.వఏఱ.స్త్రశీఱ.ఱఅవెబ్‌సైట్‌లో పేరు చెక్ చేయాలి

కొత్త ఓటు - ఫారం 6 పేరు తొలగింపు - ఫారం 7 వివరాల మార్పు - ఫారం 8

చివరి తేదీ: ఈ నెల 30 అని మాజీ కార్పొరేటర్ తెలిపారు.

తాజా

మాజీ కార్పొరేటర్ కుమారస్వామి వెంట బీఎల్‌ఓలు, స్థానిక నాయకులు జన్ను ప్రమోద్, చిన్న సుధాకర్, రైల్వే సుధాకర్, ప్రశాంత్ సయ్యద్ సాబీర్, తో పాటు స్థానికులు ఉన్నారు.

# ఏఐతో స్మార్ట్ సీవర్ నిర్వహణకు శ్రీకారం

- ప్రాజెక్ట్ శూద్'ను ప్రారంభించిన మంత్రి శ్రీధర్ బాబు



శేరిలింగంపల్లి,జూలై 11 : ఏఐ ఆధారిత సీవర్ గవర్నెన్స్ ప్లాట్‌ఫామ్ 'ప్రాజెక్ట్ శూద్'ను ఐటీ శాఖ మంత్రి డి. శ్రీధర్ బాబు శనివారం టీ-వర్క్స్‌లో ప్రారంభించారు. హైదరాబాద్‌కు చెందిన డీప్‌టెక్ స్టార్టప్ ది బాట్ ఫ్యాక్టరీ రూపొందించిన ఈ వ్యవస్థ రోబోటిక్స్, కృత్రిమ మేధస్సు, ప్రిడిక్టివ్ అనలిటిక్స్‌తో సీవర్ వ్యవస్థను పర్యవేక్షిస్తుంది. డ్రైనేజీ బ్లాకేజీలను ముందుగానే గుర్తించి హెచ్చరికలు జారీ చేయడంతో పాటు, వర్షాకాలంలో ఓవర్‌ఫ్లో సమస్యలను తగ్గించడంలో ఇది దోహదపడుతుందని మంత్రి తెలిపారు. పైలట్ పరీక్షలు విజయవంతమయ్యాయని, త్వరలో విస్తృత స్థాయిలో అమలు చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో వాటర్ బోర్డు ఎండీ అశోక్ రెడ్డి, జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్ తదితరులు పాల్గొన్నారు.

# శేరిలింగంపల్లిలో ప్రత్యేక ఓటరు గణనపై ఆకస్మిక తనిఖీ



శేరిలింగంపల్లి జులై 11: శేరిలింగంపల్లి అసెంబ్లీ నియోజకవర్గంలో జరుగుతున్న ప్రత్యేక ఓటరు గణన పురోగతిని ఎన్నికల నమోదు అధికారి నారాయణ్ అమిత్ (ఐఏఎస్) శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. జేపీ నగర్, దీప్తిశ్రీ నగర్, మాదాపూర్‌లోని మై హోమ్ అబ్రా, ఫార్చ్యూన్ టవర్స్ ప్రాంతాలను సందర్శించి గణన పనులను పరిశీలించారు.

నోడల్ అధికారులు, బూత్ స్థాయి పర్యవేక్షకులు, బూత్ స్థాయి అధికారులకు గణన ప్రక్రియను నిర్ణీత గడువులోగా వంద శాతం ఖచ్చితత్వంతో పూర్తి చేయాలని, ప్రతి ఇంటిని సందర్శించి అర్హులైన ప్రతి ఓటరు వివరాలను నమోదు చేయాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో సమన్వయంతో ప్రస్తుతం ఉన్న వేగాన్ని కొనసాగించాలని సూచించారు.

# శ్రీ రామ్ లైఫ్ ఇన్సూరెన్స్ బీమా చెక్కుల పంపిణీ ఎమ్మెల్యే డాక్టర్ : కవ్వంపల్లి

రాజన్న సిరిసిల్ల : ఇల్లంతకుంట మండల కేంద్రంలో శ్రీ రామ్ లైఫ్ ఇన్సూరెన్స్ ఆధ్వర్యంలో బీమా కలిగి ఉండి ఇటీవల మరణించిన వారి కుటుంబాలకు చెక్కుల పంపిణీ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మానకొండూర్ ఎమ్మెల్యే, టీపీసీ ఎస్సీ సెల్ చైర్మన్ డా. కవ్వంపల్లి సత్యనారాయణ ముఖ్యఅతిథిగా హాజరై బాధిత కుటుంబాలకు బీమా చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, "పెద్దదిక్కును కోల్పోయిన కుటుంబాలకు బీమాసంస్థలు అందించే సాయం కొంత మేరకు ఆర్థిక భరోసానిస్తాయన్నారు. శ్రీ రామ్ ఫైనాన్స్ సంస్థ బీమా పథకాల ద్వారా పేద, మధ్య తరగతి కుటుంబాలకు అండగా నిలవడం అభినందనీయమన్నారు. "ప్రతి ఒక్కరూ జీవిత బీమా, ఆరోగ్య బీమా వంటి పాలసీలు తీసుకోవాలని, నెలకు కొంత మొత్తం కట్టి భవిష్యత్తుకు భద్రత కల్పించుకోవాలన్నారు. ప్రభుత్వం కూడా ఆయుష్మాన్ భారత్, ఆరోగ్యశ్రీ, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా వంటి పథకాల ద్వారా ప్రజలకు అండగా ఉంటోందని చెప్పారు. ప్రైవేట్ సంస్థలు, ప్రభుత్వం కలిసి పని చేస్తేనే పేదలకు నిజమైన సహాయం అందుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ రామ్ ఫైనాన్స్ మండల మేనేజర్, సిబ్బందితోపాటు ఇల్లంతకుంట మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి భాస్కర్ రెడ్డి, స్థానిక సర్పంచ్ మామిడి రాజు, పార్టీ నాయకులు ఊట్కూరి వెంకటరమణారెడ్డి, గుడిసె అయిలయ్య, ఐరెడ్డి మహేందర్ రెడ్డి, రావికంటి భాగ్యలక్ష్మి, నేరెళ్ల విజయ్ గౌడ్, తీగల భాగ్యలత-నాగయ్య తదితరులు పాల్గొన్నారు.




# అధికారులు భూ రీ సర్వేను అత్యంత ప్రాధాన్యతగా చేపట్టాలి.

**మార్చి 2027 నాటికి మూడు విడతల్లో పూర్తి చేయాలి.**

**సాదాబైనామా దరఖాస్తుల పరిష్కారాన్ని వేగవంతం చేయాలి.**

**గుడిసెల్లో నివసించే కుటుంబాలే ప్రాధాన్యతగా రెండవ విడత ఇందిరమ్మ ఇండ్లు**




ఖమ్మం జూలై 11 : ఖమ్మం జిల్లా కలెక్టర్ కార్యలయం(ఐ డి ఓ సి)లో అన్ని జిల్లాల కలెక్టర్లతో భూ రీ-సర్వే, భూ భారతి అమలు, సాదాబైనామా దరఖాస్తుల పరిష్కారం, ఇందిరమ్మ ఇళ్లు, డబల్ బెడ్ రూమ్ ఇళ్ల పంపిణీ, పాఠశాల విద్యార్థులకు యూనిఫాంల పంపిణీ తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మంత్రి పొంగిలేటి శ్రీనివాస్ రెడ్డి అధికారులతో మాట్లాడి చర్చించడం జరిగింది

భూ భారతి చట్టం సమర్థవంతంగా అమలు కావాలంటే భూ రీ-సర్వే తప్పనిసరి అని మేధావులు సూచించడంతోనే ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా మూడు విడతల్లో భూ రీ-సర్వేను పూర్తి చేయడమే ప్రభుత్వ లక్ష్యము, దీనిపై ప్రతి నెల వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పురోగతిని సమీక్షిస్తాం అని అన్నారు. భూ రీ-సర్వేను అత్యంత ప్రాధాన్యతతో చేపట్టాలని అధికారులను ఆదేశించడం జరిగింది. పైలట్ ప్రాజెక్టుగా నక్షాలు లేని 413 ప్రాంతాల్లోని ఐదు గ్రామాల్లో నిర్వహించిన రీ-సర్వేతో 95 శాతం వరకు భూ సమస్యలు పరిష్కారమయ్యాయి. ఖమ్మంలో జరిగిన రైతు ఆశీర్వాద సభలో గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు ములుగుమాడు రైతులకు సర్వే మ్యాప్ తో కూడిన కొత్త పట్టాదారు పాస్‌బుక్‌లు పంపిణీ చేయడం జరిగింది. అని తెలిపారు. తొలి విడతలో భాగంగా ప్రతి జిల్లాలో 70 గ్రామాలను ఎంపిక చేసి రీ-సర్వే చేపట్టడం జరిగింది. ఇందుకోసం శిక్షణ పొందిన లైసెన్స్ సర్వేయర్ల సేవలను వినియోగించుకోవాలని, రెగ్యులర్ సర్వేయర్లతో సమన్వయం చేసుకోవాలని సూచించడం జరిగింది. రీ-సర్వేలో పనిచేసే లైసెన్స్ సర్వేయర్లకు ఎకరానికి రూ.50తో పాటు రవాణా, ఇతర ఖర్చుల కోసం మరో రూ.10 కలిపి మొత్తం రూ.60 అందజేస్తాం. విధుల్లో చేరని వారికి గడువిచ్చి లైసెన్సులు రద్దు చేయాలని అధికారులను ఆదేశించడం జరిగింది.

సాదాబైనామా దరఖాస్తుల తిరస్కరణలకు గల కారణాలను గుర్తించి, నిబంధనల ప్రకారం నోటీసులు జారీ చేస్తూ త్వరితగతిన పరిష్కరించాలి అని అన్నారు. పాలేరు నియోజకవర్గంలో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో వచ్చిన 6,500 రెవెన్యూ సమస్యల్లో 98 శాతం సమస్యలకు భూ రీ-సర్వేతో శాశ్వత పరిష్కారం లభిస్తుంది. ప్రభుత్వ అవసరాలకు సేకరించిన భూమిని నిషేధిత (22ఏ)జాబితాలో ఉంచడం వంటి సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించడం జరిగింది. రెండవ విడత ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికను వెంటనే పూర్తి చేయాలి. గుడిసెల్లో నివసించే కుటుంబాలకు అధికారులు తొలి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించడం జరిగింది. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ నుంచి రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి డి.ఎస్. లోకేష్ కుమార్ తో పాటు ఆయా జిల్లాల కలెక్టర్లు, సర్వే అధికారులు, రెవెన్యూ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# పోక్సో నిందితులపై రేవంత్ రెడ్డికి ఎందుకింత ప్రేమ?

రేవంత్ రెడ్డి పాలనలో రాష్ట్రం పోక్సో కేసులకు అడ్డాగా మారింది

బండి భగీరథ్‌ను 9 రోజులు అరెస్ట్ చేయలేదు..

ఆరుగురిని దారుణంగా హత్య చేసిన రాజ్ కుమార్‌ను 55 రోజులు అరెస్ట్ చేయలేదు

ఫ్యూచర్ సిటీలో అమ్మాయిలకు రక్షణ లేదు

ఫ్యూచర్ సిటీ కమీషనరేట్ పరిధిలోనే ఈ దారుణం జరిగింది

రియల్ ఎస్టేట్ దందా చేసే రేవంత్ బంధువులకే రక్షణ కల్పిస్తున్నారు

ఆరుగురి అమాయకుల హత్య ప్రభుత్వ వైఫల్యమే

రేవంత్ రెడ్డి ప్రభుత్వం 18 గంటల రివ్యూ చేసిన తర్వాత కూడా, పోక్సో నిందితులకు బెయిల్ లభిస్తుంది

నిందితుడిపై కేసు పెట్టిన తర్వాత 50 రోజుల వరకు అరెస్ట్ చేయలేదు

నిందితుడు యాంటిసిపేటరీ బెయిల్ తీసుకుంటుంటే పోలీసులు ఏం చేశారు?

నిందితుడు ఆరుగురుని చంపిన తర్వాత కూడా పోలీసులు ఇంకా అరెస్ట్ చేయలేదు

నిందితుడు ఇంకా పరారీలో ఉన్నాడు

పోలీసులు సరైన సమయంలో స్పందించి, నిందితున్ని అరెస్ట్ చేసి జైలుకు పంపితే ఇంతటి దారుణం జరిగేది కాదు

బాధిత కుటుంబం ప్రాణ భయం ఉందని చెప్పిన తర్వాత కూడా పోలీసులు పట్టించుకోలేదు

బాధిత కుటుంబాన్ని పరామర్శించడానికి వెళ్తే అరెస్ట్ చేశారు

షాబాద్ పోలీస్ స్టేషన్ ముందు వేలాది మంది ధర్నా చేస్తుంటే.. రేవంత్ రెడ్డి ఖమ్మం పిక్నిక్ టూర్ లో బిజీగా ఉన్నారు

ఇప్పటివరకు మరణించిన వారికి పోస్ట్ మార్టం చేసే దిక్కు లేదు




అరెస్ట్ చేసిన సబితా ఇంద్రా రెడ్డి, సత్యవతి రాథోడ్ గారిని వెంటనే వదిలేయాలి

మే 16న మైనర్ బాలిక నిందితునిపై కేసు పెడితే, సెక్షన్ 78, సెక్షన్ 351, సెక్షన్ 11 ఆఫ్ పోక్సో యాక్ట్ ప్రకారం కేసు నమోదు చేశారు

అయితే ఈ మూడు సెక్షన్లలో స్టేషన్ బెయిల్ ఇవ్వగలిగే కేసులే

అయినా కేసు పెట్టినప్పటి నుండి పోలీసులు నిందితున్ని అరెస్ట్ చేయలేదు, స్టేషన్ కి పిలవలేదు, కనీసం కౌన్సిలింగ్ ఇవ్వలేదు

ఫ్యూచర్ సిటీలో బంధువుల భూములు కాపాడుకోవడం కోసమే కొత్త కమీషనరేట్ పెట్టారు.. ప్రజల కోసం కాదు.

రేవంత్ రెడ్డి తన బంధువులకేమో విదేశాల నుండి దిగుమతి చేసిన అత్యాధునిక ఆయుధాలతో రక్షణ కల్పిస్తున్నారు


పోక్సో కేసు బాధితులను హత్య చేపిస్తున్నారు ఈకార్యక్రమంలో మాజీ కొడంగల్ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి, శంకర్ పల్లి మండల బి ఆర్ ఎస్ అధ్యక్షులు జి గోవర్ధన్ రెడ్డి, శంకర్ పల్లి మున్సిపల్ బి ఆర్ ఎస్ అధ్యక్షులు సోసైటీ చేర్మెన్ బద్దం శశిధర్ రెడ్డి,మాజీ ఎంపీపీ డి గోవర్ధన్ రెడ్డి, మాజీ జిల్లా సర్పంచ్ ల సంగం అధ్యక్షులు బి శ్రీధర్, నాయకులు వాసుదేవ్ కన్నా, విజయ్ కుమార్, ప్రబు గౌడ్, తదితరులు పాల్గొన్నారు

# టాటా షోరూమ్‌లో భారీ అగ్నిప్రమాదం

- కోట్ల రూపాయల ఆస్తి దగ్ధం
- ప్రాణనష్టం లేక ఊరట

శేరిలింగంపల్లి జూలై 11 : మాదాపూర్‌లోని ప్రముఖ టాటా మోటార్స్ షోరూమ్‌లో శనివారం ఉదయం భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో షోరూమ్‌లోని పలు కొత్త కార్లు, ఫర్నిచర్‌తో పాటు విలువైన ఎలక్ట్రానిక్ పరికరాలు పూర్తిగా దగ్ధమయ్యాయి. ప్రమాదంలో కోట్ల రూపాయల ఆస్తి నష్టం జరిగినట్లు ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. అయితే ప్రమాద సమయంలో షోరూమ్‌లో సిబ్బంది ఎవరూ లేకపోవడంతో పెను ప్రాణనష్టం తప్పింది.

మాదాపూర్ మెయిన్ రోడ్డులో ఉన్న ఈ షోరూమ్‌లో ఉదయం ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. క్షణాల్లోనే మంటలు భారీగా ఎగిసిపడ్డాయి. దట్టమైన పొగలు ఆకాశానికి అంటడంతో చుట్టుపక్కల వాణిజ్య సముదాయాల్లోని వారు, స్థానికులు భయాందోళనకు గురయ్యారు. వెంటనే సమాచారం అందుకున్న అగ్నిమాపక శాఖ సిబ్బంది బహుళ ఫైర్ ఇంజన్లతో ఘటనా స్థలానికి చేరుకున్నారు. దాదాపు గంటపాటు అధికారులు శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చారు.




**షార్ట్ సర్క్యూట్ అనుమానం**

ప్రమాదానికి గల కారణాలపై పోలీసులు, అగ్నిమాపక అధికారులు దర్యాప్తు చేపట్టారు. ప్రాథమికంగా విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగానే మంటలు చెలరేగి ఉండవచ్చని అధికారులు అనుమానిస్తున్నారు. అయితే ఖచ్చితమైన కారణాలు తెలియాలంటే పూర్తి స్థాయిలో విచారణ జరగాల్సి ఉందని తెలిపారు. ఘటనా స్థలాన్ని సైబరాబాద్ పోలీసులు, ఫైర్ అధికారులు సంయుక్తంగా పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి నష్టం వివరాలను సేకరిస్తున్నారు.

మంటలను వేగంగా అదుపులోకి తీసుకురావడం వల్ల ప్రక్కనే ఉన్న ఇతర దుకాణాలకు నష్టం తప్పిందని అగ్నిమాపక అధికారులు వెల్లడించారు. ఆస్తి నష్టంపై పూర్తి నివేదిక సిద్ధం చేస్తున్నామని, బీమా సంస్థలతో మాట్లాడుతున్నామని షోరూమ్ యాజమాన్యం తెలిపింది.

# బోటు బోల్తా ఘటన.. భారత ఎంబసీ అధికారులతో మాట్లాడిన మంత్రి లోకేశ్



అమరావతి: వియత్నాంలో పర్యాటక బోటు బోల్తా పడిన ఘటనలో ఏపీ వాసులు మృతి చెందిన నేపథ్యంలో మంత్రి నారా లోకేశ్ స్పందించారు. వియత్నాంలోని భారత ఎంబసీ అధికారులతో మాట్లాడారు. భాధితులకు తక్షణ సాయం అందేలా చూడాలని కోరారు. ప్రమాదంలో చిక్కుకున్న తెలుగువారికి అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. బాధితులకు ప్రభుత్వం పూర్తి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

మరోవైపు దిల్లీలోని ఏపీ భవన్ అధికారులతోనూ మంత్రి నారా లోకేశ్ మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వ అధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. వియత్నాంలోని భారత ఎంబసీతో మాట్లాడుతున్నట్లు అధికారులు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ సమన్వయంతో బాధితులకు సాయం అందించాలని లోకేశ్ సూచించారు. బాధితుల సమాచారం కోసం అక్కడి ప్రభుత్వం కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేసింది. 084 362817930, 084 915523714, 084 334520414, 084 913089165 నంబర్లలో సంప్రదించాలని కోరింది.

పడవ ప్రమాద ఘటనలో మొత్తం 15 మంది మృతి చెందగా.. 21 మంది అస్వస్థతకు గురయ్యారు. వియత్నాంలోని ఫూ క్వాక్ ద్వీపం సమీపంలో ఈ ఘటన చోటు చేసుకుంది. ఓ మొబైల్ కంపెనీ భారత్‌కు చెందిన డిస్ట్రిబ్యూటర్ల కుటుంబాలను వియత్నాం పర్యటనకు తీసుకెళ్లింది. మొత్తం 250 మందిని తీసుకెళ్లగా.. అందులో ఏపీకి చెందిన 35 మంది, తెలంగాణకు చెందిన 40 మంది ఉన్నారు.

**తెలంగాణలో కంట్రోల్ రూమ్**

మరోవైపు తెలంగాణ ప్రభుత్వం కూడా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసింది. బోటు ప్రమాదానికి సంబంధించిన సమాచారం, రాష్ట్రం నుంచి వియత్నాం పర్యటనకు వెళ్లినవారి వివరాలను 9885371189, 7997959754, 9989654807, 7997959779 నంబర్లకు ఫోన్ చేసి తెలుసుకోవచ్చని ప్రటన విడుదల చేసింది.

**ఎక్స్ వేదికగా స్పందించిన లావా మొబైల్స్**

వియత్నాం ఘటనపై లావా మొబైల్స్ ఎక్స్‌లో ప్రకటన విడుదల చేసింది. భారత్, వియత్నాం ఎంబసీతో సంప్రదింపులు జరుపుతున్నామని తెలిపింది. అక్కడున్న వారిని క్షేమంగా తీసుకొచ్చేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నామని పేర్కొంది. “బాధితులు, మృతుల కుటుంబాలను అన్ని విధాలుగా ఆదుకుంటాం. వాళ్లకు తగిన సాయం చేసేందుకు మా ప్రతినిధులు కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్నారు. వియత్నాంలోని హోచి మిన్ నగరంలో భారత రాయబార కార్యాలయం కంట్రోల్ రూం ఏర్పాటు చేసింది. 084 362817930, 084 915523714, 084 334520414 నంబర్లను సంప్రదించండి. ఘటనకు సంబంధించి ఎప్పటికప్పుడు వివరాలను అందిస్తాం” అని లావా మొబైల్స్ తెలిపింది.

# పిల్లలే సంపద అనే మాటను నిజం చేస్తాం: చంద్రబాబు




విజయవాడ: జనాభా నియంత్రణ కాదు.. జనాభా సంరక్షణ నినాదం రావాలని సీఎం చంద్రబాబు అన్నారు. ఒకప్పుడు జనాభా తగ్గాలని అందరం కోరుకున్నామని, ఇద్దరికంటే ఎక్కువ మంది ఉంటే స్థానిక సంస్థల్లో పోటీకి అనర్హులని చెప్పామని అన్నారు. కానీ, ఇప్పుడు పరిస్థితులు మారుతున్నాయని తెలిపారు. పిల్లలే సంపద అనే మాటను నిజం చేస్తామన్నారు. విజయవాడలో నిర్వహించిన ప్రపంచ జనాభా దినోత్సవ కార్యక్రమంలో చంద్రబాబు ప్రసంగించారు.

“ప్రపంచవ్యాప్తంగా జనాభా తగ్గిపోతోంది. యువత ఆశలు, ఆకాంక్షలను సాకారం చేయాలి. ఆడపిల్లలు ఇప్పుడు ఇంటికి భారం కాదు.. ఆస్తి. ఐటీ చదువుకోవాలని గతంలో ఆడపిల్లలను ప్రోత్సహించా. వరకట్నం కాదు.. ఆడపిల్లలకే ఎదురుకట్నం ఇచ్చే పరిస్థితి వచ్చింది. పిల్లలు వద్దనుకునే దంపతులు పెరగడం దురదృష్టకరం. దక్షిణాది రాష్ట్రాల్లో ఏటా జనాభా తగ్గిపోతోంది. నగరాలు, అర్బన్ ప్రాంతాల్లో జనాభా బాగా తగ్గిపోతోంది. పిల్లల సంఖ్య తగ్గి.. వృద్ధుల సంఖ్య పెరుగుతోంది. ఇంట్లో పెద్దలు లేకపోతే పిల్లల పెంపకంలో అనేక ఇబ్బందులు వస్తాయి. పిల్లలే మన రాష్ట్ర సంపద.. వారితోనే ఆర్థిక ప్రగతి. సరిపడా జనాభా లేకుంటే అనేక సమస్యలు వస్తాయి.

పిల్లల్ని పెంచే బాధ్యతను తండ్రి కూడా తీసుకోవాలి. ఇంటిపని, వంటపని అనే తేడా లేదు. అన్నింట్లోనూ మగవాళ్లు సాయం చేయాలి. సంజీవిని కింద డిజిటల్ ఆరోగ్య రికార్డులు తీసుకుంటున్నాం. మెంటల్ సిక్‌నెస్ అతిపెద్ద సమస్యగా తయారైంది. సోషల్ మీడియా వల్ల మానసిక సమస్యలు పెరుగుతున్నాయి. విలువైన సమయం వృథా చేసుకుంటున్నారు. నేటి యువత యోగా, ధ్యానం అలవరచుకోవాలి. 60 ఏళ్లు దాటాక సమాజం కోసం పని చేయాలి. జీవితాంతం నేర్చుకుంటూనే ఉండాలి. నైపుణ్యాలు పెంచుకోవాలి. నియంత్రణ లేకుంటే ఏ టెక్నాలజీ అయినా ప్రమాదమే. ప్రతి ఒక్కరూ జీవితాన్ని సరిగా ప్లాన్ చేసుకోవాలి. జనాభా తగ్గిపోతే అనుకున్న లక్ష్యాలు సాధించలేం. 2040కే స్వర్ణాంధ్ర సాధించుకునే సత్తా మనకుంది ” అని చంద్రబాబు అన్నారు.

# నారా బ్రాహ్మణికి అరుదైన గుర్తింపు.. మంత్రి లోకేశ్ హర్షం

హెరిటేజ్ ఫుడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నారా బ్రాహ్మణి (ఛ్తీథ్తీ దీథ్తీషఖ్మిఅఱ)కి అంతర్జాతీయ స్థాయిలో అరుదైన గుర్తింపు దక్కింది. ప్రముఖ బిజినెస్ మ్యాగజైన్ ‘ఫార్చ్యూన్ ఇండియా’ ప్రకటించిన మోస్ట్ పవర్‌ఫుల్ విమెన్ – 2026 జాబితాలో ఆమె చోటు సంపాదించారు. భారతదేశ ఆర్థిక వృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న మహిళా పారిశ్రామికవేత్తల జాబితాలో బ్రాహ్మణి నిలవడం విశేషం.

దిల్లీలో జరిగిన ఫార్చ్యూన్ ఇండియా ‘మోస్ట్ పవర్‌ఫుల్ విమెన్ 2026’ సదస్సులో బ్రాహ్మణికి ఈ అవార్డును అందజేశారు. హెరిటేజ్ ఫుడ్స్ ప్రస్థానంలో రైతుల పాత్ర ఎనలేనిదని, పాల ఉత్పత్తిలో నూతన సాంకేతికతను జోడిస్తూనే.. అన్నదాతల జీవనోపాధిని మెరుగుపరచడమే తమ ప్రధాన లక్ష్యమని ఈ సందర్భంగా బ్రాహ్మణి స్పష్టం చేశారు. ఈ అరుదైన గుర్తింపును హెరిటేజ్ ఫుడ్స్ కుటుంబానికి, రైతులకు, సంస్థ ఉద్యోగులకు అంకితమిస్తున్నట్లు ప్రకటించారు. తన భార్య సాధించిన ఘనతపై మంత్రి నారా లోకేశ్ (ఛ్తీథ్తీ ూశీవంష్త్ర) హర్షం వ్యక్తం చేశారు. ఫార్చ్యూన్ ఇండియా ప్రకటించిన 100 మంది అత్యంత ప్రభావవంతమైన మహిళల జాబితాలో బ్రాహ్మణి నిలవడం తమకు ఎంతో గర్వకారణమన్నారు. ఇలాగే ప్రతిభను చాటుతూ, నాయకత్వ లక్షణాలతో మరిన్ని అవరోధాలను అధిగమించాలని ఆకాంక్షించారు.




# విశాఖ తూర్పు నావికాదళంలో కొలువుదీరిన ‘మహేంద్రగిరి’



విశాఖపట్నం: మారుతున్న వ్యూహాత్మక పరిస్థితులను దృష్టిలోఉంచుకొని భారత నావికాదళం అప్రమత్తంగా ఉందని కేంద్ర రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ (=ఖయఅఫ్త్ర ూఱఅస్త్రష్త్ర) తెలిపారు. విశాఖ తూర్పు నావికాదళంలో యుద్ధనౌక ఐఎన్ఎస్ ‘మహేంద్రగిరి’ కమిషనింగ్ వేడుకకు రక్షణమంత్రి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. యుద్ధనౌకను ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు.

“భవిష్యత్తులో యుద్ధాల స్వభావం పూర్తిగా మారిపోతోంది. డ్రోన్లు, సైబర్ దాడుల రూపంలో సవాళ్లు ఎదరయ్యే ప్రమాదం ఉంది. సాంకేతికంగా ఇంకా బలంగా ఉండేలా నూతన ఆవిష్కరణలకు ప్రణాళికలు రూపొందిస్తున్నాం. రక్షణ రంగం మరింత బలోపేతం చేసే దిశగా శరవేగంగా అడుగులు వేస్తున్నాం. అత్యాధునిక, సరికొత్త యుద్ధనౌకలను నావికాదళం సమకూర్చుకుంటోంది. స్వదేశీ నైపుణ్యంతో రూపుదిద్దుకొని సేవలందించేందుకు మహేంద్రగిరి సిద్ధమైంది. శత్రు రాడార్లకు చిక్కకుండా కడలిలో దూసుకుపోవడం దీని ప్రత్యేకత. భవిష్యత్తులోనూ మరిన్ని ఆవిష్కరణలు రాబోతున్నాయి” అని రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు.

# బి.ఆర్. అంబేద్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ బి.వీ. జయ నాగేశ్వర్ రెడ్డి

ఎమ్మిగనూరు : నందవరం మండల కేంద్రంలో నిర్వహించిన భారత రాజ్యాంగ శిల్పి, భారతరత్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహావిష్కరణ మహోత్సవంలో ఎమ్మెల్యే డా. బి.వి. జయ నాగేశ్వర రెడ్డి ఘనంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నందవరం మండలంలోని గ్రామ ప్రజలు, యువత ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనాగేశ్వర్ రెడ్డి కి ఘన స్వాగతం పలికారు. ముందుగా మహర్షి వాల్మీకి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనాగేశ్వర్ రెడ్డి భారీ ర్యాలీలో పాల్గొంటూ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం వద్దకు చేరుకున్నారు. అక్కడ ప్రత్యేక కార్యక్రమాల నడుమ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించి, సభలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనాగేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ భారత రాజ్యాంగ రూపకర్త మాత్రమే కాకుండా, సామాజిక న్యాయం, సమానత్వం,



విద్య మరియు అణగారిన వర్గాల సాధికారతకు జీవితాంతం కృషి చేసిన మహనీయుడని, అందరివాడని కొనియాడారు. రాజ్యాంగం ప్రతి భారతీయుడికి సమాన హక్కులు, అవకాశాలు కల్పించే శక్తివంతమైన పునాదిగా నిలిచిందని పేర్కొన్నారు. యువత అంబేద్కర్ గారి ఆశయాలను ఆదర్శంగా తీసుకుని విద్యను ఆయుధంగా చేసుకుని సమాజ అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. అలాగే, కూటమి ప్రభుత్వం సామాజిక న్యాయం, సమగ్ర అభివృద్ధి మరియు ప్రతి వర్గం సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తోందని, డాక్టర్ అంబేద్కర్ కలలుగన్న సమానత్వ సమాజ నిర్మాణ దిశగా ప్రజలందరూ కలిసి ముందుకు సాగాలని ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనాగేశ్వర్ రెడ్డి గారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నందవరం మండల అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు మరియు సభ్యులు, అంబేద్కర్ విగ్రహ కమిటీ సభ్యులు, ఏఎంసీ చైర్మన్, టీడీపీ పార్లమెంట్ ఉపాధ్యక్షులు, మాజీ జడ్పీ వైస్ చైర్మన్, మార్కెట్ యార్డు డైరెక్టర్, డిసేబుల్డ్ వెల్ఫేర్ ఉ మల్లెల ట్రస్ట్ అధినేత, టీడీపీ మండల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు, నందవరం మండలం మరియు వివిధ గ్రామాల ఎస్సీ యువకులు, మహిళలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# భూ రీ-సర్వేను అత్యంత ప్రాధాన్యతగా చేపట్టాలి: మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి







కరీంనగర్ : భూ భారతి చట్టం సమర్థవంతంగా అమలు కావాలంటే రాష్ట్రవ్యాప్తంగా భూ రీ-సర్వేను అత్యంత ప్రాధాన్యతతో చేపట్టాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అధికారులను ఆదేశించారు. భూ రీ-సర్వే, భూ భారతి అమలు, సాదాబైనామా దరఖాస్తుల పరిష్కారం, ఇందిరమ్మ ఇండ్లు, 2బీహెచ్‌కే ఇళ్ల పంపిణీ, పాఠశాల విద్యార్థులకు యూనిఫాంల పంపిణీ తదితర అంశాలపై మంత్రి, శనివారం ఖమ్మం జిల్లా కలెక్టరేట్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. హైదరాబాద్ నుంచి రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి డి.ఎస్. లోకేష్ కుమార్, ఉన్నతాధికారులు పాల్గొనగా..కరీంనగర్ జిల్లా కలెక్టరేట్ నుంచి కలెక్టర్ చిత్రా మిశ్రా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ధరణిని రద్దు చేసి భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చామని, రైతుల భూములకు పూర్తి భద్రత కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. భూ భారతి అమల్లోకి వచ్చి 15 నెలలు పూర్తయినా ప్రజల అంచనాలకు పూర్తిస్థాయిలో చేరలేకపోయామని తెలిపారు. ధరణి కాలంలో పెండింగ్‌లో ఉన్న 9.26 లక్షల సాదాబైనామా దరఖాస్తుల పరిష్కారం కోసం భూ భారతిలో అవకాశం కల్పించి, హైకోర్టు సమస్యను కూడా పరిష్కరించినప్పటికీ అధిక సంఖ్యలో దరఖాస్తులు తిరస్కరణకు గురవుతున్నాయనే అభిప్రాయం ప్రజల్లో ఉందని, తిరస్కరణ లకు గల కారణాలను గుర్తించి పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. భూ భారతి చట్టం సమర్థవంతంగా అమలు కావాలంటే భూ రీ-సర్వే తప్పనిసరి అని మేధావులు సూచించడంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని తెలిపారు. ఇందు కోసం శిక్షణ పొందిన లైసెన్స్ సర్వేయర్ల సేవలను వినియోగించుకోవాలని, రెగ్యులర్ సర్వేయర్లు, లైసెన్స్ సర్వేయర్లు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. లైసెన్స్ సర్వేయర్లకు ఉద్యోగం లేదా రెగ్యులరైజేషన్ హామీ ఇవ్వలేదని స్పష్టం చేశారు. పైలట్ ప్రాజెక్టుగా నక్షాలు లేని 413 ప్రాంతాల్లోని ఐదు గ్రామాల్లో నిర్వహించిన రీ-సర్వేతో 95 శాతం వరకు భూ సమస్యలు పరిష్కారమయ్యాయని తెలిపారు. శుక్రవారం ముఖ్యమంత్రి ములుగుమాడు గ్రామ రైతులకు కొత్త పట్టాదారు పాస్‌బుక్‌లు పంపిణీ చేశారని గుర్తు చేశారు. తొలి విడతలో ప్రతి జిల్లాలో 70 గ్రామాలను ఎంపిక చేసి రీ-సర్వే చేపట్టినట్లు తెలిపారు. రీ-సర్వేకు అవసరమైన అత్యుత్తమ నాణ్యత గల పరికరాలను జిల్లా స్థాయిలో కొనుగోలు చేయాలని, కొనుగోలు ముందు రాష్ట్ర ప్రభుత్వంతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. కలెక్టర్లు భూ రీ-సర్వేను అత్యంత ప్రాధాన్యత అంశంగా తీసుకుని అవసరమైన సిబ్బంది,పరికరాలు, మౌలిక వసతులు సమకూర్చాలని ఆదేశించారు. ప్రతి నెల వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పురోగతిని సమీక్షిస్తామని, మార్చి-2027 నాటికి మూడు విడతల్లో రీ-సర్వే పూర్తి చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. రీ-సర్వేలో పనిచేసే లైసెన్స్ సర్వేయర్లకు ఎకరానికి రూ.50తో పాటు రవాణా, ఇతర ఖర్చుల కోసం మరో రూ.10 చెల్లించి మొత్తం రూ.60 అందజేస్తామని తెలిపారు.

# రక్తపోటును తగ్గించి.. గుండె ఆరోగ్యాన్ని పెంచే సూపర్ టీ !



మందారం చెట్టు పూలు అందమైన రంగులతో ప్రసిద్ధి పొందినవి మాత్రమే కాకుండా ఆరోగ్యకరమైన గుణాలను కూడా కలిగి ఉన్నాయి. మందారం పువ్వు నుంచి తయారయ్యే మందారం టీ అనేక ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుంది. ఇది ప్రాచీన ఆయుర్వేద, చైనీస్ వైద్య విధానాల్లో కూడా ఉపయోగించబడింది. మందారం టీ, దాని రుచికరమైన ఆమ్లత్వంతో పాటు అనేక ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుంది. ఇది కేవలం ఒక పానీయం మాత్రమే కాదు, ఒక ఆయుర్వేద ఔషధం కూడా. ఇందులోని యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్ సి, మరియు ఇతర పోషకాలు శరీరానికి అనేక విధాలుగా మేలు చేస్తాయి. ఇప్పుడు ఈ టీ తాగడం ద్వారా కలిగే ముఖ్యమైన ప్రయోజనాలను పరిశీలిద్దాం: "అవోకాడోను ఆహారంలో చేర్చుకుంటున్నారా? ఒక్కసారి వీటిని దృష్టిలో పెట్టుకోవాల్సిందే.!" 1. రక్తపోటు నియంత్రణ మందారం టీ రక్తపోటును తగ్గించే గుణాలను కలిగి ఉంది. దీనిలో ఉండే యాంటీహైపర్టెన్సివ్ లక్షణాలు, రక్తపోటు స్థాయిని తగ్గించడంలో సహాయపడతాయి. అనేక పరిశోధనలు మందారం టీ తాగడం వల్ల రక్తపోటు నియంత్రణ సులభం అవుతుందని నిరూపించాయి. 2. గుండె ఆరోగ్యం ఈ టీ లో యాంటీ ఆక్సిడెంట్లు ఎక్కువగా ఉండడం వల్ల గుండెకు చాలా మంచిది. ఇది చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించి, మంచి కొలెస్ట్రాల్‌ను పెంచుతుంది. హృదయ సంబంధిత వ్యాధుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది. 3. బరువు తగ్గడం మందారం టీ జీవక్రియను వేగవంతం చేసి, కొవ్వు కణాలను కరిగించడానికి సహాయపడుతుంది. ఇది మటాబాలిజంను పెంచి, శరీరంలో కొవ్వు నిల్వలను తగ్గించడంలో సహాయపడుతుంది. ఇందులోని యాంటీ ఇన్ఫ్లమేటరీ గుణాలు మొటిమలను తగ్గించడానికి సహాయపడతాయి. "ఖాళీ కడుపుతో ఈ పండ్లు తింటున్నారా? .. అయితే తిప్పలే..!! " 4. దయాబెటిస్‌ను నియంత్రిస్తుంది ఇది రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడానికి సహాయపడుతుంది. మందారం పువ్వులో ఉన్న యాంటీ ఆక్సిడెంట్లు, ఫ్రీ రాడికల్స్ కారణంగా జరిగే కణాల నష్టాన్ని తగ్గిస్తాయి. ఇది వృద్ధాప్య లక్షణాలను తగ్గించడంలో ముఖ్య పాత్ర పోషిస్తుంది. 5. జీర్ణవ్యవస్థ మెరుగుదల మందారం టీ జీర్ణ సమస్యల నుంచి ఉపశమనం కలిగించడంలో సహాయపడుతుంది. ఇది ప్రేగుల శుభ్రతను మెరుగుపరచి, జీర్ణ ప్రక్రియను వేగవంతం చేస్తుంది.ఇది కాలేయంలో కొవ్వు పేరుకుపోవడాన్ని నిరోధిస్తుంది. మందారం టీని గుండ్రంగా తాగడం ద్వారా మలమూత్ర సమస్యలు తగ్గుతాయి. ఇది శరీరానికి డీటాక్సిఫికేషన్ చేస్తుంది. 6. ఇమ్యూనిటీ పెంపు దీనిలో విటమిన్ అ శాతం ఎక్కువగా ఉండడం వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుంది. ఇది శరీరాన్ని వైరల్, బ్యాక్టీరియల్ ఇన్ఫెక్షన్ల నుంచి రక్షించడంలో కీలకంగా ఉంటుంది. మందారం టీ జీవక్రియను వేగవంతం చేసి, కొవ్వు కణాలను కరిగించడానికి సహాయపడుతుంది. ''మధుమేహం ఉన్నవారు ఉడికించిన చిలగడదుంపలు తినొచ్చా?. " 7. చర్మ ఆరోగ్యం మందారం టీ చర్మం మెరిసిపోవడానికి సహాయపడుతుంది. ఇందులోని యాంటీ ఆక్సిడెంట్లు చర్మ కణాలను రక్షించి, ఆరోగ్యవంతమైన మరియు తేజోవంతమైన చర్మాన్ని అందిస్తాయి. 8. ఒత్తిడి తగ్గింపు ఈ టీ తాగడం మానసిక ఒత్తిడిని తగ్గిస్తుంది. ఇది సహజమైన నరాల శాంతికారకంగా పనిచేస్తుంది, రాత్రిళ్లు మంచి నిద్ర కోసం ఇది ఉపయోగపడుతుంది. 9. హార్మోన్ల సమతుల్యత మందారం టీ మహిళల హార్మోన్ల సమతుల్యతను కాపాడడంలో సహాయపడుతుంది. మాసికధర్మం సమస్యల వల్ల కలిగే అసౌకర్యాలను తగ్గించడంలో కూడా ఇది సహాయపడుతుంది. తయారీ విధానం మందారం టీ తయారు చేయడం చాలా సులభం. ఒక కప్పు నీళ్లలో మందారం పువ్వులను మరిగించాలి. సుమారు 5 నిమిషాల పాటు దాన్ని ఆవిరి రాకుండా మూతపెట్టి ఉంచాలి. తరువాత దాన్ని ఫిల్టర్ చేసి, రుచికి తేనె కలుపుకోవచ్చు. అయితే మందారం టీని అధిక పరిమాణంలో తీసుకోవడం మంచి కాదు. గర్భిణీ మహిళలు లేదా మందులు తీసుకుంటున్న వారు డాక్టర్ సలహా తీసుకోవాలి. మందారం టీ తాగడం ద్వారా మీరు ఆరోగ్య ంగా,ఉల్లాసం గా ఉండవచ్చు. ఫలితాల కోసం ఇది ఆరోగ్యకరమైన జీవన శైలిలో భాగంగా మిళితమవ్వాలి.

# బంగాళదుంపతో చేసిన సమోసా తింటున్నారా?

సమోసా అంటే వినగానే నోరూరించే భారతీయ స్నాక్‌గా ప్రసిద్ధి చెందింది. ఇందులో ప్రధానంగా బంగాళదుంప, మసాలాలు, మరియు మైదా పిండి పుట్టు ఉపయోగించబడతాయి. బంగాళదుంపతో చేసిన సమోసా అంటే ఎవరికైనా నోరూరించే స్నాక్. క్రిస్పీ కవర్‌లో మసాలాదారు బంగాళదుంప స్టఫింగ్ అద్భుతమైన కలయిక. అయితే, రోజూ తినే ఆహారంలో భాగంగా సమోసాను ఎంచుకోవడం ఎలాంటి ప్రభావం చూపుతుంది? దీని గురించి మనం వివరంగా తెలుసుకుందాం. సమోసాల చరిత్ర: సమోసాల మూలాలు పర్షియా లేదా ఆధునిక ఇరాన్‌కు చెందినవిగా భావిస్తారు. భారతదేశంలో మొఘల్ రాజుల కాలంలో సమోసాలు ప్రవేశపెట్టబడ్డాయి. ఆ తర్వాత భారతీయ రుచికి అనుగుణంగా మార్పులు చేర్పులు జరిపి, ఇప్పుడు సమోసాలు భారతీయ వంటకాలలో ఒక భాగంగా మారిపోయాయి. "చింతచిగురు చికెన్ తింటున్నారా?" సమోసాలోని పోషక విలువలు, ప్రయోజనాలు: సమోసా చాలా రుచికరమైన స్నాక్. ఇది చాలా మందికి ఇష్టమైన ఆహారం. బంగాళదుంపల వల్ల సమోసాలో కార్బోహైడ్రేట్లు ఎక్కువగా ఉంటాయి. ఇవి శరీరానికి శక్తిని అందిస్తాయి. ఈ సమోసాను వేయించడం వల్ల కొవ్వు పదార్థాలు ఎక్కువగా ఉంటాయి. అధిక కొవ్వులు బరువు పెరగడానికి కారణమవుతాయి. దీనిలో ప్రోటీన్లు తక్కువగా ఉంటాయి. బంగాళదుంపల్లో కొన్ని విటమిన్లు , ఖనిజాలు ఉంటాయి. అయితే, వేయించే ప్రక్రియలో చాలా వరకు నాశనమవుతాయి. సమోసా తినడం వల్ల కలిగే అప్రయోజనాలు: సమోసాలో కొవ్వు మరియు కేలరీలు ఎక్కువగా ఉంటాయి. ఇది బరువు పెరగడానికి దారితీస్తుంది. సమోసాలోని కార్బోహైడ్రేట్లు రక్తంలో చక్కెర స్థాయిలను పెంచుతాయి. దీర్ఘకాలంలో మధుమేహం వచ్చే ప్రమాదం ఉంది. దీనిలో అధిక కొవ్వు పదార్థాలు హృదయ సంబంధిత సమస్యలకు దారితీస్తాయి. ఎక్కువగా మసాలా ఉండే సమోసా జీర్ణ సమస్యలకు కారణమవుతుంది. సమోసాలో అవసరమైన పోషకాలు తక్కువగా ఉంటాయి. దీర్ఘకాలంలో ఇది పోషకలోపానికి దారితీస్తుంది. అంతే కాకుండా సమోసా పుట్టు సాధారణంగా మైదాతో తయారు చేస్తారు. మైదా జీర్ణవ్యవస్థకు సహజమైనది కాకపోవడం వల్ల దీన్ని తరచూ తినడం మానవ ఆరోగ్యానికి హానికరం. సమోసాలో ఉపయోగించే నూనెలు ఒఆఒ (ఖరాబైన కొలెస్ట్రాల్)ను పెంచే అవకాశాలు ఉన్నాయి, ఇది హృదయ సంబంధిత సమస్యలకు దారితీస్తుంది ఎవరు గెలిచారో చూడండి ၊ానివతినిటతిజీ ౹వశ్రీబీణబీ 5 5 ఆరోగ్యకరమైన ప్రత్యామ్నాయాలు: బంగాళదుంపలతో పాటు కూరగాయలను కలిపి స్టఫింగ్ చేస్తే పోషక విలువలు పెరుగుతాయి. గోధుమ పిండి బదులు మొక్కజొన్న పిండితో చేసినవి ఆరోగ్యకరంగా ఉంటాయి. వేయించిన బదులు బేక్ చేస్తే కొవ్వు తగ్గుతుంది. "మేక గుండెకాయను ఎప్పుడైనా తిన్నారా?" బంగాళదుంప సమోసా చాలా రుచికరమైన స్నాక్ అయినప్పటికీ, దీనిని తరచూ తినడం ఆరోగ్యానికి హానికరం. ఆరోగ్యకరమైన జీవనశైలి కోసం, సమోసాకు బదులుగా కూరగాయలు, పండ్లు వంటి ఆరోగ్యకరమైన ఆహారాలను తీసుకోవడం మంచిది. ఏదైనా ఆహారాన్ని మితంగా తీసుకోవడం చాలా ముఖ్యం. ఆరోగ్యకరమైన జీవనశైలి కోసం సమతుల ఆహారాన్ని తీసుకోవాలి. ఏదైనా ఆరోగ్య సమస్య ఉంటే, ఆహార నిపుణుడిని సంప్రదించడం మంచిది.




# లోబీపీ ఎందుకు వస్తుంది? తగ్గాలంటే ఏం చేయాలి?

లోబీపీ లేదా హైపోటెన్షన్ అనేది రక్తపోటు స్థాయి సాధారణ పరిమితుల కంటే తక్కువగా ఉంటే ఏర్పడే పరిస్థితి. ఇది చాలా మందిలో కనిపించే సమస్య. సాధారణ రక్తపోటు 120/80 ఎఎఊణ గా ఉంటుంది. దీనిలో 90/60 ఎఎఊణ కంటే తక్కువగా ఉంటే దానిని లోబీపీగా పరిగణిస్తారు. ఇది కొన్ని సందర్భాల్లో తీవ్రమైన ఆరోగ్య సమస్యలకు దారితీసే ప్రమాదం కలిగిస్తుంది. లోబీపీకి కారణాలు శరీరంలో తగినంత నీరు లేకపోవడం వల్ల డీహైడ్రేషన్‌ను దారితీస్తుంది. దీని వల్ల రక్తపోటు తగ్గిపోతుంది. పోషక లోపాలు కూడా లోబీపీకి కారణమవుతాయి. ముఖ్యంగా ఐరన్, విటమిన్ ః12, ఫోలిక్ యాసిడ్ తక్కువగా ఉండడం వల్ల రక్తహీనత, దాంతోపాటు లోబీపీ కూడా వస్తుంది. ఆకస్మికంగా నిల్చోవడం లేదా శరీర ద్రవాలు తగ్గించడం వల్ల రక్తప్రసరణలో లోపం కలుగుతుంది. క్షతగాత్రం లేదా శస్త్రచికిత్సల వల్ల అధిక రక్తనష్టం జరిగితే రక్తపోటు పడిపోతుంది. థైరాయిడ్ సమస్యల వల్ల లేదా అడ్రినల్ గ్రంధి సరిగా పనిచేయకపోవడం వల్ల లోబీపీ కలగవచ్చు. కొన్ని రకాల మందులు, డయూరెటిక్ మందులు తీసుకోవడం వల్ల రక్తపోటు తగ్గుతుంది. "బీరకాయలతో ఆరోగ్యానికి బోలెడు లాభాలు!" లోబీపీ లక్షణాలు లోబీపీ వల్ల ప్రధానంగా తల తిరుగడం, అలసట, మగత, గుండె వేగం తగ్గడం , బలహీనత, చల్లగా ఉండే చర్మం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, చెమటలు పట్టడం , వికారం, వాంతులు , అపస్మారం స్థితిలోకి వెళ్లడం వంటి లక్షణాలు కన్పిస్తాయి. లోబీపీ తగ్గించడానికి చర్యలు లోబీపీ ఉన్నవారు రోజుకు 8-10 గ్లాసుల నీరు తాగడం చాలా ముఖ్యం. సోడియం తక్కువగా ఉన్నప్పుడు రక్తపోటు తగ్గుతుంది. లావణ్యం అధికంగా ఉండే ఆహారాలు తీసుకోవడం మంచిది. పండ్లు, కూరగాయలు, తృణధాన్యాలు ఎక్కువగా తినండం మంచిది. చల్లని పరిస్థితుల్లో లేదా అలసట అనిపించినప్పుడు వేడి కాఫీ తాగడం ఉపశమనం కలిగిస్తుంది.

# నెల రోజులు ఉదయాన్నే ఖాళీ కడుపుతో కరివేపాకు నీరు తాగితే?

కరివేపాకులో విటమిన్ సి, విటమిన్ ఎ, కాల్షియం, ఐరన్, మెగ్నీషియం వంటి అనేక ముఖ్యమైన పోషకాలు పుష్కలంగా ఉంటాయి. ఈ పోషకాలు శరీరానికి అవసరమైన రోగనిరోధక శక్తిని పెంచుతాయి, ఎముకలను బలపరుస్తాయి , రక్తాన్ని శుద్ధి చేస్తాయి . కరివేపాకు నీరు అనేది ఆరోగ్యకరమైన అనేక గుణాలను కలిగి ఉంటుంది. ప్రతి రోజూ ఖాళీ కడుపుతో దీన్ని త్రాగడం ద్వారా శరీరానికి ఎన్నో ప్రయోజనాలు కలుగుతాయి. శరీరంలో వివిధ రకాల సమస్యలను తొలగించి, ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో సహాయపడుతుంది. 1. జీర్ణవ్యవస్థకు మేలు: కరివేపాకు నీరు జీర్ణ సమస్యలను నివారించడంలో సహాయపడుతుంది. ఇది గ్యాస్, అసిడిటీ వంటి సమస్యలను తగ్గించి, పౌష్టికాంశాలను శరీరానికి సులభంగా అందనివ్వడంలో సహాయపడుతుంది. కరివేపాకులో ఉండే ఫైబర్ జీర్ణవ్యవస్థను శుభ్రపరచడంలో సహాయపడుతుంది. "లోబీపీ ఎందుకు వస్తుంది? తగ్గాలంటే ఏం చేయాలి? " 2. లివర్ డిటాక్సిఫికేషన్: కరివేపాకులో ఉండే న్యూట్రియంట్లు లివర్‌ను డిటాక్స్ చేయడంలో సహాయపడతాయి. ఇది లివర్‌ను శక్తివంతంగా ఉంచుతుంది మరియు వృథా పదార్థాలను శరీరం నుండి బయటకు పంపిస్తుంది. 3. బరువు తగ్గడానికి: ఖాళీ కడుపుతో కరివేపాకు నీరు త్రాగడం ద్వారా శరీరంలో మెటబాలిజం పెరుగుతుంది. ఇది కొవ్వు పెరుగుదలను నియంత్రిస్తుంది మరియు శరీరంలో చక్కెర స్థాయిలను సమతుల్యం చేస్తుంది. 4. రక్తం శుభ్రపరచడం: కరివేపాకు నీరు రక్తాన్ని శుభ్రపరచడంలో సహాయపడుతుంది. ఇది శరీరంలో విషతుల్య పదార్థాలను తొలగించి చర్మానికి మెరుగైన ఆరోగ్యాన్ని అందిస్తుంది. "ఉసిరికాయను తేనెలో నానబెట్టి ఉదయాన్నే తింటే?" 5. షుగర్ నియంత్రణ: దయాబెటిక్ వ్యక్తుల కోసం ఇది చాలా ఉపయోగకరంగా ఉంటుంది. కరివేపాకులో ఉండే సహజ మూలికా గుణాలు రక్తంలో చక్కెర స్థాయిలను సమతుల్యం చేయడంలో ఉపయోగపడతాయి. 6. జుట్టు ఆరోగ్యం: కరివేపాకులో ఉండే ప్రోటీన్లు మరియు విటమిన్లు జుట్టు వృద్ధికి సహాయపడతాయి. కరివేపాకు నీరు త్రాగడం ద్వారా జుట్టు నల్లగా, ఆరోగ్యంగా మారుతుంది. 7. హృదయ ఆరోగ్యం: కరివేపాకు రక్తంలో చెడు కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించి హృదయ ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో సహాయపడుతుంది. ఇది గుండెపోటు వంటి సమస్యలను నివారించడంలో ఉపకరిస్తుంది. "మేక గుండెకాయను ఎప్పుడైనా తిన్నారా?" కరివేపాకు నీరు తయారీ విధానం: కొన్ని తాజా కరివేపాకు ఆకులను తీసుకుని శుభ్రంగా కడగాలి. నీటిలో వడగట్టి బాగా మరిగించండి. నీటిని గోరువెచ్చగా చేసి ఖాళీ కడుపుతో త్రాగండి. ఖాళీ కడుపుతో కరివేపాకు నీరు త్రాగడం ఒక సహజ మరియు సురక్షితమైన ఆరోగ్య పద్ధతి. ఇది శరీరానికి ఆంతరంగికంగా శక్తిని అందించి, వ్యాధి నిరోధక శక్తిని పెంచుతుంది. అధికంగా కరివేపాకు నీరు తాగడం వల్ల కొన్ని సమస్యలు వచ్చే అవకాశం ఉంది. కాబట్టి, మితంగా తాగడం మంచిది. దీన్ని తరచూ ఉపయోగించే ముందు వైద్యనిపుణుడిని సంప్రదించడం మంచిది.





# అవోకాడోను ఆహారంలో చేర్చుకుంటున్నారా? ఒక్కసారి వీటిని దృష్టిలో పెట్టుకోవాల్సిందే.!

అవోకాడో, "సూపర్ ఫుడ్"గా ప్రసిద్ధి చెందిన ఫలంగా, పోషకాలతో నిండిన అద్భుతమైన పండు. దీన్ని వెన్నపండు. దీనిలో ఆరోగ్యకరమైన కొవ్వులు, విటమిన్లు, మినరల్స్, ఫైబర్ అధిరంగా ఉంటాయి. దీన్ని మీ రోజువారీ ఆహారంలో చేర్చుకోవడం ద్వారా శరీరానికి అనేక రకాల ఆరోగ్య ప్రయోజనాలను అందించవచ్చు. 1. గుండె ఆరోగ్యానికి మేలు అవోకాడోలో ఉండే మోనోసేచురేటెడ్ ఫ్యాట్స్ (ముఖ్యంగా ఒలిక్ ఆమ్లం) హృదయ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి. ఇవి చెడు కొలెస్ట్రాల్ (ఒఆఒ) స్థాయులను తగ్గించి, మంచి కొలెస్ట్రాల్ ను పెంచడంలో సహాయపడతాయి. అలాగే, పొటాషియం సమృద్ధిగా ఉండటం వల్ల రక్తపోటును నియంత్రించడంలో మేలు చేస్తుంది.కొబ్బరి నీళ్లలో కొద్దిగా ఉప్పు కలిపి తాగితే శరీరానికి ఏమవుతుందో తెలుసా?"కొబ్బరి నీళ్లలో కొద్దిగా ఉప్పు కలిపి తాగితే శరీరానికి ఏమవుతుందో తెలుసా?". జీర్ణవ్యవస్థకు సహాయపడుతుందిఅవోకాడోలో పుష్కలంగా ఉండే ఫైబర్ జీర్ణ వ్యవస్థను పటిష్టం చేస్తుంది. ఇది మలబద్ధకం సమస్యను తగ్గించడమే కాకుండా, ప్రొబయోటిక్స్‌ను ప్రోత్సహించే మైనరల్స్‌ను అందిస్తుంది. ఇది జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది3. చర్మం, జుట్టు ఆరోగ్యం కోసంఈ పండులో ఉండే విటమిన్ ఇ మరియు అ, శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్లుగా పనిచేస్తాయి. ఇవి చర్మానికి తేలికైన మృదుత్వాన్ని అందించడంలో, వృద్ధాప్య లక్షణాలను తగ్గించడంలో సహాయపడతాయి. అలాగే, జుట్టు రాలడాన్ని నియంత్రించి, జుట్టుకు మెరుపు తెస్తాయి. 4. కంటి ఆరోగ్యం మెరుగుపరుస్తుందిఅవోకాడోలోని ల్యూటిన్ మరియు జియాక్సాంతిన్ అనే ఫైటోకెమికల్స్ కంటి ఆరోగ్యం కోసం అత్యంత ముఖ్యమైనవి. ఇవి కంటి కంటక్రం మరియు వయసుతో వచ్చే మాక్యులర్ డిజెనరేషన్ సమస్యలను నివారించగలవు.ఒనీనిణ ఒతిటవ: పెళ్లి, బీరుపై 105 ఏళ్ల బామ్మ కీలక కామెంట్స్.. లాంగ్ లైఫ్ సీక్రెట్స్ రివీల్"ఒనీనిణ ఒతిటవ: పెళ్లి, బీరుపై 105 ఏళ్ల బామ్మ కీలక కామెంట్స్.. లాంగ్ లైఫ్ సీక్రెట్స్ రివీల్". బరువు తగ్గడంఅవోకాడో తినడం శరీరానికి ఆరోగ్యకరమైన కొవ్వులను అందించడమే కాకుండా, తృప్తిని కలిగించి భోజనం తినే కోరికను తగ్గిస్తుంది. ఇది బరువు నియంత్రణకు ఉపయోగపడుతుంది. 6. ఎముకల బలాన్ని పెంచుతుందిఇందులో ఉండే విటమిన్ ఐ, క్యాల్షియం శరీరంలో మెరుగ్గా గ్రహించబడేందుకు సహాయపడుతుంది. ఇది ఎముకల బలాన్ని మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషిస్తుంది. 7. గర్భిణీ స్త్రీల ఆరోగ్యానికి మేలుఅవోకాడోలోని ఫోలేట్ (విటమిన్ ః9) గర్భిణీ స్త్రీల కోసం అత్యంత ముఖ్యమైన పోషకం. ఇది పిండం ఆరోగ్యం మరియు మెదడు అభివృద్ధికి సహాయపడుతుంది.అమ్మ బాబోయ్.. టూత్‌పేస్టు వాడితే ఇన్ని అనర్థాలా? "అమ్మ బాబోయ్.. టూత్‌పేస్టు వాడితే ఇన్ని అనర్థాలా? "8. డయాబెటిస్ నియంత్రణఅవోకాడోలో ఉండే ఫైబర్ మరియు తక్కువ గ్లైసెమిక్ ఇండెక్స్ రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో సహాయపడతాయి, ఇది డయాబెటిక్ రోగులకు ఎంతో మేలు చేస్తుంది.అవోకాడోను తీసుకునే సరైన విధానంఅవకాడోను సలాడ్స్‌లో కలిపి తీసుకోవచ్చు. స్మూతీల్లో, టోస్ట్ లేదా శాండ్‌విచ్‌లో మకాణంగా ఉపయోగించుకోచ్చు. అవోకాడోను మెత్తగా చేసి, ఉప్పు, మిరియాలు, లైమ్ రసం, మరియు ఇతర మసాలాలతో కలిపి గ్వాకామోలే తయారు చేసుకోవచ్చు. అవోకాడో అధికంగా తీసుకోవడం కొన్నిసార్లు వెయిట్ గెయిన్ లేదా జీర్ణ సంబంధిత సమస్యలకు కారణమవుతుందని, మితంగా తీసుకోవడం మంచిది.



# సినిమా

## వర్షంలో 12 గంటలపాటు ఏకబిగిన చిరు షూటింగ్

### మైసా కోసం అండర్ వాటర్‌లో రష్మిక సాహసం



ప్రేక్షకులను అలరించడం కోసం నటీనటులు ఎంత కష్టాన్నైనా భరిస్తారు. పాత్ర కోసం ఎంత రిస్క్ అయినా తీసుకుంటారు. ప్రస్తుతం సినీ ప్రియులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిత్రాల్లో చిరంజీవి హీరోగా రానున్న మెగా 158 ఒకటైతే.. రష్మిక ప్రధానపాత్రలో తెరకెక్కుతోన్న 'మైసా' మరొకటి. ఈ చిత్రాల కోసం అటు చిరు.. ఇటు రష్మిక ఎంతో కష్టపడుతున్నారు. తాజాగా ఈ రెండు సినిమాల అప్‌డేట్స్‌ను ఆయా చిత్రబృందాలు పంచుకున్నాయి. మెగా 158లో వర్షంలో సీక్వెన్స్ కోసం చిరంజీవి 12 గంటలు ఏకధాటిగా షూటింగ్ చేయగా.. 'మైసా' కోసం రష్మిక అండర్ వాటర్ సీక్వెన్స్‌ను పూర్తి చేశారు. చిరంజీవి హీరోగా బాబీ దర్శకత్వంలో మెగా158 (వర్కింగ్ టైటిల్) తెరకెక్కుతోన్న విషయం తెలిసిందే. ప్రస్తుతం హైదరాబాద్‌లో వేసిన ఓ భారీ సెట్‌లో యాక్షన్ సన్నివేశాలు చిత్రీకరిస్తున్నారు.

ఉదయం 4 గంటలకు వ్యాయామంతో తన రోజును ప్రారంభించే చిరంజీవి నిబద్ధత చూసి మా చిత్రబృందం ఆశ్చర్యపోయింది. అత్యంత కఠినమైన యాక్షన్ సన్నివేశాలను షూట్ చేయడం కోసం 12 గంటలు పట్టింది. వర్షంలో ఉండే ఈ సన్నివేశాన్ని చిరు ఎంతో కష్టపడి పూర్తి చేశారు. అందుకే ఆయన మెగాస్టార్ అయ్యారు అని టీమ్ పోస్ట్ చేసింది.'మైసా' కోసం మునుపెన్నడూ లేనివిధంగా రష్మిక శ్రమిస్తున్నారని దర్శకుడు రవీంద్ర పుల్లె తెలిపిన విషయం తెలిసిందే. యదార్థ సంఘటనల ఆధారంగా రూపొందుతోన్న ఈ చిత్రంలో ఆమె.. గోండు తెగకు చెందిన మహిళగా కనిపించనున్నారు. ఈ సినిమా కోసం సవాలుతో కూడిన స్టంట్స్ చేసిన నటి.. తాజాగా అండర్ వాటర్ సీక్వెన్స్‌ను పూర్తి చేశారు. సినిమాలో ఈ సన్నివేశం చాలా ఆసక్తిగా ఉంటుందని టీమ్ వెల్లడించింది. ఈ చిత్రం కోసం అంతర్జాతీయ స్టంట్ కొరియోగ్రాఫర్ కెచా ఖంపక్డీ ఆధ్వర్యంలో రష్మిక శిక్షణ పొందారు.






## మరో సస్పెన్స్ థ్రిల్లర్... వదల




సీనియర్ నటుడు జగపతిబాబు ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న సైకలాజికల్ థ్రిల్లర్ 'వదల' విడుదలకు సిద్ధమవుతోంది. దర్శకుడు అకెళ్ల వి. కృష్ణ తెరకెక్కించిన ఈ చిత్రం ఈ నెల 17వ తేదీన ప్రేక్షకుల ముందుకు రానుండగా, ప్రస్తుతం చిత్ర బృందం ప్రమోషన్లను వేగవంతం చేసింది. ఈ నేపథ్యంలో తాజాగా విడుదలైన ట్రైలర్ సినిమాపై ఒక్కసారిగా అంచనాలను పెంచేసింది. ఈ చిత్రంలో లయ కథానాయికగా నటించగా, హృతిక శ్రీనివాస్ అత్యంత కీలక పాత్రలో కనిపించనున్నారు. కిషోర్ నాయుడు చిరుమామిళ్ల, తమ్మారెడ్డి భరద్వాజ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ట్రైలర్‌ను గమనిస్తే, మొదట ఒక సాధారణ కుటుంబ కథలా సినిమా ప్రారంభమవుతుంది. ఇరవై ఏళ్లుగా సంతోషకరమైన దాంపత్య జీవితాన్ని గడుపుతున్న దంపతులుగా జగపతిబాబు, లయ కనిపిస్తారు. ఒకరిపై ఒకరికి అపారమైన ప్రేమ, ఆప్యాయతతో జీవిస్తున్న వారి జీవితంలోకి అనూహ్యంగా ఓ యువతి ప్రవేశించడం కథను పూర్తిగా మలుపుతిప్పుతుంది. పక్కింటికి వచ్చిన ఆ యువతి జగపతిబాబు పాత్రపై ప్రమాదకరమైన స్థాయిలో మోజు పెంచుకోవడం, క్రమంగా అది వ్యామోహంగా మారడం ట్రైలర్‌లో ఆసక్తికరంగా చూపించారు. అదే సమయంలో లయ పాత్రకు గుర్తు తెలియని వ్యక్తుల నుంచి బెదిరింపులు రావడం, కుటుంబంపై ముప్పు పెరగడం కథలోని సస్పెన్స్‌ను మరింత పెంచుతోంది. ఈ చిత్రంలో కుటుంబాన్ని కాపాడుకోవడానికి పోరాడే వ్యక్తిగా జగపతిబాబు కనిపిస్తున్నారు. కుటుంబ బాధ్యతలు, అనుకోని ప్రమాదం మధ్య చిక్కుకున్న వ్యక్తి పాత్రలో ఆయన నటన ట్రైలర్‌లోనే ఆకట్టుకుంటోంది. లయ కూడా సహజమైన నటనతో కుటుంబ భావోద్వేగాలను బలంగా ఆవిష్కరించినట్లు కనిపిస్తోంది. మరోవైపు హృతిక శ్రీనివాస్ పోషించిన పాత్ర ట్రైలర్‌కే ప్రధాన ఆకర్షణగా నిలిచింది. ఆమె హావభావాలు, డైలాగ్ డెలివరీ, బాడీ లాంగ్వేజ్ సినిమాపై ఆసక్తిని మరింత పెంచుతున్నాయి. దర్శకుడు అకెళ్ల వి. కృష్ణ మరోసారి థ్రిల్లర్ జానర్‌పై తన పట్టు చూపించినట్లు ట్రైలర్ స్పష్టం చేస్తోంది. కథలో ఎక్కడా సస్పెన్స్ తగ్గకుండా, అదే సమయంలో కుటుంబ భావోద్వేగాలను కూడా సమతుల్యంగా చూపించే ప్రయత్నం చేసినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా ఆ యువతి అసలు ఉద్దేశం ఏమిటి? ఆమె జగపతిబాబు జీవితంలోకి ఎందుకు వచ్చింది? ఈ సంఘటనల వెనుక అసలు నిజం ఏమిటి? అనే ప్రశ్నలకు సమాధానం తెలుసుకోవాలనే ఆసక్తిని ట్రైలర్ చివరి వరకు కొనసాగిస్తుంది. ఈ చిత్రానికి ప్రముఖ సినిమాటోగ్రాఫర్ చోటా కె. నాయుడు అందించిన విజువల్స్ థ్రిల్లర్ మూడ్‌ను మరింత బలపరిచాయి. డార్క్ టోన్స్, విజువల్ ఫ్రేమింగ్ కథలోని ఉత్కంఠను పెంచేలా ఉన్నాయి. సంగీత దర్శకుడు కార్తీక్ కోడకండ్ల అందించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ ప్రతి సన్నివేశానికి అదనపు థ్రిల్‌ను జోడించింది.

## నెట్‌ఫ్లిక్స్‌లోకి వచ్చేసిన పెద్ది




రామ్ చరణ్ హీరోగా బుచ్చిబాబు దర్శకత్వంలో వచ్చిన చిత్రం 'పెద్ది' నెట్‌ఫ్లిక్స్ వేదికగా ఓటీటీ ప్రేక్షకుల ముందుకు వచ్చింది. అయితే, థియేటర్ వెర్షన్ కంటే ఓటీటీలో కొన్ని సీన్స్ యాడ్ చేశారు. రన్‌టైం కారణంగా కట్ చేసిన సన్నివేశాలను, థియేటర్‌లో విడుదలైయ్యాక తొలగించిన సీన్స్‌ను కూడా ఇందులో యాడ్ చేసినట్లు తెలుస్తోంది. దీంతో అభిమానులు ఖుష్ అవుతున్నారు. తెలుగుతో పాటు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో ఇది అందుబాటులోకి వచ్చింది. కథేంటంటే.. విజయనగరం జిల్లాలోని కొండ కింద ఊరు అది. వందల మంది జీవనం సాగిస్తున్నా.. ప్రభుత్వ రికార్డుల్లో ఆ ఊరికి గుర్తింపు లేదు. అందుకే ఆ ఊరు అన్నా, అక్కడి నుంచి వచ్చిన మనుషులన్నా అందరికీ చిన్న చూపు. ఆ ఊళ్లో పుట్టి పెరిగిన వాడే పెద్ది (రామ్‌చరణ్). రోజూ విజయనగరం వెళ్లి కూలి పనులు చేస్తాడు. పేరుకి కూలీ అయినా క్రికెట్‌లో మాత్రం రాటుదేలిన ఆటగాడు. అందుకే విజయనగరం, బొబ్బిలి క్రికెట్ జట్లు వేలంలో పెద్దిని కొనేందుకు పోటీపడుతుంటాయి. ఆరు బంతులకు ఆరు సిక్సర్లు కొట్టగలిగిన మొనగాడైన పెద్దిని అంతా ఆట కూలీ అని పిలుస్తుంటారు. అలాంటి పెద్ది క్రికెట్‌ని వదిలి కుస్తీ క్రీడాకారుడిగా ఎందుకు మారాల్సి వచ్చింది? ఈ కథలో అచ్చియమ్మ (జాన్వీ కపూర్) ఎవరు?తన గ్రామం కోసం పెద్ది ఏం చేశాడు? అన్నదే సినిమా కథ.

## భారీ బడ్జెట్ చిత్రంగా టాక్సిస్




కేజీఎఫ్' సిరీస్‌తో పాన్ ఇండియా స్టార్‌గా ఎదిగిన యశ్ ప్రస్తుతం నటిస్తున్న అత్యంత ప్రతిష్టాత్మక చిత్రం 'టాక్సిక్'. మలయాళ దర్శకురాలు గీతూ మోహన్‌దాస్ తెరకెక్కిస్తున్న ఈ సినిమా ప్రారంభం నుంచే భారీ అంచనాలు నెలకొల్పింది. పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా రూపొందుతున్న ఈ చిత్రాన్ని అత్యున్నత నిర్మాణ విలువలతో రూపొందిస్తున్నారు. సినిమా నిర్మాణ వ్యయం దాదాపు రూ.500 కోట్లకు పైగా ఉంటుందని ఇండస్ట్రీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. యాక్షన్, హింసాత్మక నేపథ్యం, భారీ విజువల్స్‌తో రూపొందుతున్న ఈ చిత్రం పాన్ ఇండియా స్థాయిలో విడుదల కానుంది. ఇప్పటికే విడుదలైన రెండు గ్లింప్స్‌తో పాటు ఒక పాటకు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభించింది. తాజాగా ఈ సినిమా బడ్జెట్‌కు సంబంధించిన మరో ఆసక్తికర విషయం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ప్రచారం ప్రకారం, మొత్తం బ్జడెట్‌లో దాదాపు రూ.100 కోట్లు ప్రధాన తారాగణం, దర్శకురాలు, కీలక సాంకేతిక నిపుణుల రెమ్యూనరేషన్లకే వెచ్చిస్తున్నట్లు తెలుస్తోంది. హీరో యశ్ ఈ సినిమా కోసం సుమారు రూ.50 కోట్ల పారితోషికం తీసుకుంటున్నారని, అంతేకాకుండా సినిమా లాభాల్లో కూడా వాటా ఉండేలా ఒప్పందం చేసుకున్నారని సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఇక చిత్రంలో హీరోయిన్‌గా నటిస్తున్న కియారా అద్వానీకి సుమారు రూ.15 కోట్లు పారితోషికంగా అందుతున్నట్లు సమాచారం. కీలక పాత్రలో కనిపించనున్న నయనతారకు రూ.12 కోట్లు, మరో ముఖ్యమైన పాత్రలో నటిస్తున్న రుక్మిణి వసంత్‌కి రూ.3 కోట్లు ఇస్తున్నట్లు టాక్ వినిపిస్తోంది. అలాగే తారా సుతారియా, హ్యూమా ఖురేషిలకు చెరో రూ.2 కోట్ల వరకు పారితోషికం చెల్లిస్తున్నట్లు సినీ వర్గాల్లో ప్రచారం సాగుతోంది. దర్శకురాలు గీతూ మోహన్‌దాస్‌తో పాటు ఇతర కీలక సాంకేతిక నిపుణుల పారితోషికాలు కలిపితే మొత్తం రెమ్యూనరేషన్ వ్యయం రూ.100 కోట్ల మార్క్‌ను దాటే అవకాశముందని చర్చ జరుగుతోంది. కేవలం నటీనటుల పారితోషికాలే కాకుండా సినిమా నిర్మాణంపైనా భారీగా ఖర్చు చేస్తున్నట్లు తెలుస్తోంది. పీరియాడిక్ బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కుతున్న ఈ చిత్రానికి భారీ సెట్లు, ప్రత్యేక ఆర్ట్ డైరెక్షన్, అత్యాధునిక విజువల్ ఎఫెక్ట్స్ ప్రధాన ఆకర్షణలుగా ఉండనున్నాయి. అందుకే ఆర్ట్ డిపార్ట్‌మెంట్, యాక్షన్ సీక్వెన్స్‌లు, సాంకేతిక అంశాలపై కూడా నిర్మాతలు భారీగా పెట్టుబడి పెడుతున్నట్లు సమాచారం

Printed by Published by **KALIDINDI RAJA JAGADESHWARA SANTOSH** on behalf of **KALIDINDI RAJA JAGADESHWARA SANTOSH**, Printed at and Published at 1-7-750/1-3, F 103 and 102, ST. PIOUS SCHOOL ROAD, Sruthi Sadan Apts, Ramnagar, Hyderabad-500020, Telangana. Editor **RAGHURAMA RAJU KALIDINDI.** PRGI NUMBER TGTEL/25/A3603, CELL : 9849379430, MAIL ID: kingdailynewspaper@gmail.com